RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY — తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి / MALKAJGIRI | సంపుటి : 3 / VOLUME : 3 | సంచిక : 180 / ISSUE NO : 180 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ / EDITOR : MERUGU CHANDRAMOHAN | గురువారం, జనవరి 08, 2026 / Thursday, January, 8, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- / PAGES : 8 RS : 4 /- |
|---|---|---|---|---|---|



## వీధి కుక్కల కేసు విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్యలు

- కుక్క ఏ మూడ్ లో ఉందో ఎవరూ ఊహించలేరన్న సుప్రీం ధర్మాసనం
- కరిచినా, కరవకున్నా కుక్కల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాఖ్య
- వీధుల్లో, స్కూల్స్, విద్యా సంస్థల పరిసరాల్లో కుక్కలు ఉండాల్సిన అవసరమేంటని ప్రశ్న

ఢిల్లీ,: వీధి కుక్కలు ఎప్పుడు కరుస్తాయనే విషయం ఎవరూ ఊహించలేరని, వాటి మూడ్ ను అర్థం చేసుకోలేరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధుల్లో సంచరించే కుక్కలు తరచూ వాహనాలకు అడ్డుపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని గుర్తుచేసింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్ హోంలకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్ ను ధర్మాసనం ఈ రోజు విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. వీధుల్లో తిరిగే కుక్క కరుస్తుందని భావించినపుడు స్థానికులు అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు.

అధికారులు ఆ శునకాన్ని తీసుకువెళ్లి స్టెరిలైజ్ చేసి వదిలిపెడతారని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్టెరిలైజ్ చేశాక మనుషులను కరవకుండా వాటికి కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పడం మర్చిపోయినట్టున్నారని వ్యాఖ్యానించింది. మనుషులను కరవడం మాత్రమే కాదు.. వీధుల్లో కుక్కలు పరిగెత్తడం వల్ల వాహన ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ధర్మాసనం గుర్తు చేసింది. ప్రమాదం జరిగాక చికిత్స తీసుకోవడం కన్నా ముందే జాగ్రత్త పడడం మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధుల్లో, స్కూళ్లు, విద్యాసంస్థల చుట్టుపక్కల కుక్కలు సంచరించాల్సిన అవసరం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. వీధుల్లో సంచరించే ప్రతీ కుక్క మనుషులను కరవకపోవచ్చు కానీ రోడ్లపై అవి అడ్డదిడ్డంగా పరుగులు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం మాత్రం ఉందని ధర్మాసనం పేర్కొంది.



## 50 మిలియన్ బ్యారెళ్ల ఇంధనం అమ్మనున్న వెనిజులా

### అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్

న్యూయార్క్: వెనిజులా దేశం నుంచి సుమారు 50 మిలియన్ బ్యారెళ్ల ఇంధనాన్ని కొనుగోలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. అయితే మార్కెట్ ధరకే వెనిజులా ఆ ఇంధనాన్ని అమ్మనున్నట్లు పేర్కొన్నారు. హై క్వాలిటీ ఆయిల్ అమ్మకం తక్షణమే ప్రారంభం అవుతుందన్నారు. వెనిజులా దేశాధ్యక్షుడు మదురోను కొన్ని రోజుల క్రితం అమెరికా దళాలు నిర్బంధించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వెనిజులా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఆ దేశం నుంచి ఆయిల్ ఖరీదు చేయనున్నట్లు చెప్పారు. వెనిజులా ప్రజల బెనిఫిట్ కోసం ఆ డబ్బును ఖర్చు చేస్తారని ట్రంప్ తెలిపారు. అమెరికాలోని అన్‌లోడింగ్ డాక్స్‌కు ఆ ఇంధన నౌకలను తరలిస్తారని ట్రంప్ పేర్కొన్నారు.వెనిజులా ఇంధనాన్ని అమ్మే ప్రక్రియపనులను ఎనర్జీ మంత్రి క్రిస్ రైట్ చూసుకుంటున్నారన్నారు. వెనిజులా ఆయిల్ పరిశ్రమ గురించి చర్చించేందుకు అమెరికా ఆయిల్ కంపెనీ పెద్దలు త్వరలో ట్రంప్‌తో భేటీకానున్నారు.



## మున్సిపల్ ఎన్నికల్లో బిజెపిని ఆదరించండి

### కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి

హైదరాబాద్,తెలంగాణ దిశ : బిజెపితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని, డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లనే రాష్ట్రం పురోగమనిస్తుందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. నరేంద్రమోడీ నాయకత్వంలో భారత్ ఉజ్వలంగా ఉందన్నారు. తెలంగాణలో కూడా భవిష్యత్ బాగుండాలని కోరుకుంటున్నామని అన్నారు. జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో భాజపాకు అవకాశం ఇవ్వాలని, అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇటీవలి పంచాయితీ ఎన్నికల్లో పలుచోట్ల బిజెపి బలం చాటిందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ బిజెపిని ఆశీర్వదించాలన్నారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో నిర్మించనున్న సింథటిక్ ట్రాక్ స్థలాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ పరిశీలించారు. స్థల విషయమై ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా జమ్మికుంట, హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.కోటి వ్యయంతో ఆధునిక పరికరాలను సమకూర్చానని చెప్పారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు చర్యలు తీసుకుంటామన్నారు.



## కెసిఆర్ అప్పులు చేసింది నిజమే

- ఆ అప్పులు తెలంగాణ అభివృద్ధి కోసమే
- సిఎం రేవంత్ ఫ్రస్టేషన్‌లో ఉన్నాడు
- కొత్త పల్లవి అందుకున్న బిఆర్ఎస్ నేత కెటిఆర్

ఖమ్మం,తెలంగాణ దిశ :తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన ప్రాజెక్టులు తీసుకొచ్చారని కెటిఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అప్పు చేసిన మాట వాస్తవమేనని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అయితే చేసిన అప్పు తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించారని వివరించారు. ఇందులో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదన్నారు. ఇకపోతే సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్‌లో ఉన్నారని కెటిఆర్ అన్నారు. ఆయనలో అంత ఫ్రస్టేషన్ ఎందుకో తనకు అర్థం కావడం లేదని తెలిపారు. సెక్యూరిటీ వాళ్ళతో పాటు పోలీసుల్ని సైతం ఆయన కొడుతున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని.. అరుస్తున్నాడు.. కొడుతున్నాడు.. రేపు ఎవరినైనా కరుస్తాడేమో జాగ్రత్త' అంటూ సీఎం భార్య గీతకు ఈ సందర్భంగా కేటీఆర్ హితవు పలికారు. అధికార కాంగ్రెస్ పార్టీలోని అగ్రనేతలకు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలోని కీలక నేతల మధ్య మాటలు తూటాలు పేలుతున్న క్రమంలో కెటిఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల వేడి బాగా పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం హైదబారాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే.. లాగులో తొండలు వదులుతాం అంటున్నారని మండి పడ్డారు. ఎప్పటికప్పుడు న్యూఢిల్లీ పోయి కప్పం కట్టి వస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కప్పం కట్టకపోతే తన పదవి ఉండదని.. ఊడిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌కి తెలుసునన్నారు. తాను ఆంధ్రప్రదేశ్ వెళ్లి చదువుకుంటే తప్పు.. ఆయన మాత్రం ఆంధ్రాలోని భీమవరంకు చెందిన వ్యక్తిని అల్లుడిగా తెచ్చుకోవచ్చు నంటూ కేటీఆర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను అమెరికాలో బాత్‌రూమ్‌లు కడుక్కుంటున్నానని అన్నారు. మరి అమెరికాలో మీ సోదరుడు జగదీష్ రెడ్డి కూడా ఉన్నాడని.. ఆయన తన ఇంట్లో ఆయనే కడుక్కోవట్లేదా? అంటూ సీఎం రేవంత్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ చురకలంటించారు. అమెరికాలో ఎవరింట్లో పనులు వాళ్ళే చేసుకుంటారని.. ఈ విషయం తెలయకుంటే తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజలు.. మిమ్మల్ని గెలిపించింది ఈ పనికిమాలిన డైలాగుల కోసం కాదని..



## ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మరో షాక్

**రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు**


- ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు కార్పొరేటర్లు
- తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి

ఖమ్మం,తెలంగాణ దిశ :ఖమ్మంలో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. ఈరోజు మరో ముగ్గురు కార్పొరేటర్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్లు ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవిలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదివరకే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మీ, జి. చంద్రకళ, డి. సరస్వతి, అమృతమ్మ, ఎం.శ్రావణి కూడా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.



## కేసీఆర్ సెంట్రిక్ గా స్కెచ్

హైదరాబాద్,తెలంగాణ దిశ : దమ్ముంటే అసెంబ్లీకి రా. అన్ని అంశాలపై చర్చిద్దాం. ఓడగొడితే ప్రజల ముఖం చూడవా అంటూ..కేసీఆర్ ఇగోను టచ్ చేస్తున్నారు సీఎం రేవంత్. గులాబీ బాస్ మాత్రం రేవంత్ వ్యూహానికి చిక్కకుండా సభకు రాకుండానే తన సెంట్రిక్‌గానే చర్చ జరిగేలా స్కెచ్ వేశారట.దీంతో కేసీఆర్ అసెంబ్లీకి వచ్చేలా రేవంత్ ఇంకా ప్రెజర్ పెంచుతున్నారన్న టాక్ వినిపిస్తోంది. లేటెస్ట్‌గా ఎమ్మెల్సీ కవిత కూడా కేసీఆర్ అసెంబ్లీకి రావాల్సిందే అనడం హాట్ టాపిక్ అవుతోంది. సభకు రాకుండానే సార్ లైమ్‌లైట్‌లో ఉండే ప్లాన్ చేస్తున్నారా? ఏం చేసైనా కేసీఆర్‌ను అసెంబ్లీకి రప్పించాలనేది రేవంత్ వ్యూహమా?మొన్నటి వరకు గులాబీ దళపతి మౌనం తెలంగాణ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా కొనసాగిం ది. లేటెస్ట్‌గా సార్ మీడియా ముందుకు వచ్చారు. కృష్ణా జలాలు, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతలపై స్ట్రాంగ్ వాయిస్ వినిపించి చర్చకు తెరలేపారు. ఆ తర్వాత అసెంబ్లీ సెషన్ స్టార్టింగ్ రోజు సభకు అటెండ్ అయి ఇంకా క్యూరియాసిటీ పెంచేశారు. అసెంబ్లీలో చర్చలో పాల్గొనేందు కు కేసీఆర్ వస్తున్నారంటూ లీకులు వచ్చాయి. కానీ శుక్రవారం జరిగిన సభకు సార్ రాలేదు. సెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ శాసనసభ్యులు కూడా తమకుమాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని వాకౌట్ చేశారు.అయితే కేసీఆర్ అసెంబ్లీకి రావాలంటూ ఎత్తుకున్న రాగాన్నిఎంతకు వదిలి పెట్టడం లేదు సీఎం రేవంత్. పదేపదే సవాళ్లు విసురుతున్నారు. పైగా మీరు సభకు రండి..సలహాలు..సూచనలు ఇవ్వండి అంటూ పిలుపిస్తున్నారు. అంతటితో ఆగకుండా కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన గౌరవానికి ఎలాంటి భంగం కలిగించబోమని హామీ ఇస్తున్నారు రేవంత్. గతసర్కార్‌హయాంలో జరిగి న తప్పిదాలపై చర్చించేందుకు కేసీఆర్ సభకు రావాలని అంటున్నారు.



## ఎమ్మెల్సీ కవిత రాజీనామా ఆమోదం

### బీఆర్ఎస్‌తో తెగిన బంధం

- కవిత రాజీనామాకు మండలి ఛైర్మన్ సుఖేందర్ రెడ్డి ఆమోదముద్ర
- పార్టీ నుంచి సస్పెన్షన్, వరుస పరిణామాల నేపథ్యంలో నిర్ణయం
- 'సామాజిక తెలంగాణ' లక్ష్యంగా తెలంగాణ జాగృతి సరికొత్త కార్యాచరణ

హైదరాబాద్,తెలంగాణ దిశ : నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజీనామాను శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదిం చారు. ఈ మేరకు మండలి కార్యద ర్శి వి. నర్సింహాచార్యులు మంగళవా రం అధికారిక ఉత్తర్వులు జారీ చేశా రు. 2021లో రెండోసారి ఎమ్మెల్సీ గా ఎన్నికైన కవిత, పార్టీ అగ్రనేతల తో విభేదాల నేపథ్యంలో కొంతకాలంగా బీఆర్ఎస్‌కు దూరంగా ఉంటున్నారు. పార్టీలోని కీలక నేతలు హరీశ్‌రావు, సంతోష్‌రావులను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడంతో గత సెప్టెంబరులో బీఆర్ఎస్ ఆమెపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆ వెంటనే కవిత తన ఎమ్మెల్సీ పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. సోమవారం స్వయంగా మండలికి వచ్చిన ఆమె తన రాజీనామాను ఆమోదించాలని ఛైర్మన్‌ను కోరడంతో ఈ ప్రక్రియ పూర్తయింది. దీంతో బీఆర్ఎస్‌తో ఆమెకు ఉన్న సుదీర్ఘ అనుబంధం అధికారికంగా ముగిసినట్లయింది.

# కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్‌గా తటాకం వెంకటేష్ ప్రమాణ స్వీకారం

## - ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్







**కీసర, జనవరి 07, (తెలంగాణ దిశ)** :కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం మహోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన తటాకం వెంకటేష్ కు పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 2026 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ జడ్ పి చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు నక్కా ప్రభాకర్ గౌడ్, పాండాల యాదగిరి గౌడ్, ఏ బ్లాక్ అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు కొత్త రామారావు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, కీసర మండలం అధ్యక్షులు బాలరాజు, ఎంబిసి మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 28 నుంచి సీఎం కప్ ఆటల పోటీలు



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 07, (తెలంగాణ దిశ)** :సీఎం కప్ 2025-26 లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మండల, అసెంబ్లీ, జిల్లా స్థాయిలో ఆటల పోటీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి వై. దామోదర్ రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి 28 నుండి 31 జనవరి వరకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3 నుండి 7 ఫిబ్రవరి వరకు జిల్లా స్థాయి ఫిబ్రవరి 10 నుండి 14 వరకు నిర్వహించడం జరుగుతుందని దామోదర్ తెలిపారు. ఆసక్తి గల యువతి, యువకులు http://satg.telangana.gov.in/cmcup/signup. ఆన్ లైన్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

# అంకిరెడ్డి పల్లి ప్రధాన రహదారిలో నిబంధనలకు విరుద్ధంగా షెడ్డు నిర్మాణం

## - పుట్టగొడుగుల్లా షెడ్లు... పట్టించుకోని అధికారులు








**కీసర, జనవరి 07, (తెలంగాణ దిశ)** :కీసర సర్కిల్ పరిధిలోని అంకిరెడ్డిపల్లి లో పుట్టగొడుగుల్లా షెడ్లు నిర్మాణం అవుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. సర్వే నెంబర్ 147,148 లలో భారీగా అక్రమ షెడ్ నిర్మాణంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. షెడ్డు నిర్మాణానికి అవసరమైన అనుమతులు లేకుండానే ఈ నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ భూమి స్వరూపాన్ని మార్చుతూ రెవిన్యూలో కన్వర్షన్ చేయకుండానే పెద్ద ఎత్తున షెడ్లు నిర్మించడం వల్ల రహదారి భద్రతకు ముప్పు ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా అంకిరెడ్డిపల్లి ప్రధాన రహదారిపై వాహన రాకపోకలు పెరుగుతున్న ఈ తరుణంలో అక్రమ షెడ్డు నిర్మాణం వల్ల ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ జరుగుతున్న ఈ పనులపై మున్సిపల్ ఉన్నతాధికారులు, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ షెడ్ నిర్మాణంపై తక్షణమే విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన షెడ్లను తొలగించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ప్రజా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించి, మున్సిపల్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# ప్రహరీ కూల్చారు... గది కూల్చడం మరిచారు..

## - కమర్షియల్ కాంప్లెక్స్ స్థలంలో అక్రమ నిర్మాణం...






**చర్లపల్లి, జనవరి 07, (తెలంగాణ దిశ)** :చర్లపల్లి డివిజన్ వాసవి శివానగర్ సమీపంలోని శ్రీ సాయి కృష్ణ కాలనీ లేఅవుట్ లో కమర్షియల్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణం యదేచ్ఛగా సాగుతుంది. ఈ స్థలంలో ఒక గది తోపాటు చుట్టూ ప్రహరీ గోడ నిర్మిస్తుండడంతో జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ అధికారులకు స్థానికులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన జిహెచ్ఎంసి అధికారులు బుధవారం ప్రహరీ గోడను కూల్చివేశారు. అందులో నిర్మించిన గదిని కూల్చకుండా వదిలేసి వెళ్లిపోయారు. ప్రహరీని కూల్చి, గదిని వదిలి వేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. ఈ విషయంలో కాలనీ సంక్షమ సంఘాల సమాఖ్య (సిసిఎస్) అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి మాట్లాడుతూ జిహెచ్ఎంసి కాపురా సర్కిల్ అధికారులు పేదలకు ఒక నీతి పెద్దలకు ఒక రీతి అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇక్కడికి సమీపంలోని మోడీ విశిష్ట హోమ్స్ సమీపంలో కేవలం 55 గజాలలో పేదలు ఇల్లు నిర్మించుకుంటే కూల్చివేసిన అధికారులు.... ఇక్కడ మాత్రం గదిని కూల్చకపోవడంలో ఆంతర్యం ఏమిటి అని ప్రశ్నించారు. పలుకుబడి కలిగిన వ్యక్తులకు జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు జీ హుజూర్ అంటున్నారని తెలిపారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కూల్చివేయమని చెప్పినప్పటికీ పట్టించుకోకుండా కిందిస్థాయి సిబ్బంది వెళ్లిపోయారని ఆయన విమర్శించారు. ఇందుకు బాధ్యులైన అధికారులు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# సుబ్రహ్మణ్య నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలపై పరిష్కరించాలి



**ఏఎస్ రావునగర్, జనవరి 07, (తెలంగాణ దిశ)** :కాలనీలో నెలకొన్న సమస్యలపై పరిష్కరించాలని కోరుతూ సుబ్రహ్మణ్య నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి సైనిక్ పురిలోని ఎమ్మెల్యే నివాసంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ సుబ్రహ్మణ్య నగర్ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీటి సమస్య, రోడ్ల దుస్థితి, వీధి దీపాల కొరత వంటి సమస్యల వల్ల కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపై నిలిచిపోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీలో తక్షణమే డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరారు. అదే విధంగా దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేసి సీసీ రోడ్లు నిర్మించాలని, తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని అధికారులను కోరారు. అలాగే వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో భద్రతను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి తప్పకుండా పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ బాబు, భాస్కర్ రావు, నాగేందర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాగార్జున్ రెడ్డి పాపట్ల, ప్రధాన కార్యదర్శి శ్రీ హరి ఎల్లా, సంయుక్త కార్యదర్శి వెంకటేష్ కురా, కృష్ణ రాజేశ్వర రావు సురేతో పాటు కార్యవర్గ సభ్యులు వెంకట నాగేంద్ర కుమార్, వెంకట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి పది తర్వాత శబ్ద కాలుష్యం చేసిన... బాణాసంచా కాల్చినా కఠిన చర్యలు



**కుషాయిగూడ, జనవరి 07, (తెలంగాణ దిశ)** :రాత్రి 10 తర్వాత శబ్ద కాలుష్యం, బాణాసంచా కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫంక్షన్ హాళ్ల యజమానులు, మేనేజర్లతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాత్రి పది గంటల తర్వాత ఎలాంటి శబ్ద కాలుష్యం జరిగినా, నిబంధనలకు విరుద్ధంగా బాణాసంచా కాల్చినా చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు తప్పనిసరిగా శబ్ద నియంత్రణ నిబంధనలను పాటించాలని సూచించారు. అనుమతులు లేకుండా డీజేలు వినియోగించడం, నిషేధిత సమయాల్లో లౌడ్ స్పీకర్లు ఉపయోగించడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి చట్టాలు, నిబంధనలపై ఫంక్షన్ హాల్ యజమానులు, మేనేజర్లకు అవగాహన కల్పించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

# శాస్త్రీయ దృక్పథమే సమాజ పురోగతికి మార్గం

## - కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కేశెట్టి ప్రసాద్



**ఏఎస్ రావునగర్, జవవరి 07, (తెలంగాణ దిశ)** :సమాజంలో శాస్త్రీయ ఆలోచన విధానం పెంపొందితేనే సానుకూల మార్పు సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ ఏఎస్ రావునగర్ డివిజన్ అధ్యక్షులు కేశెట్టి ప్రసాద్ అన్నారు. జన విజ్ఞాన వేదిక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సైన్స్ క్యాలెండర్‌ను కేశెట్టి ప్రసాద్ బుధవారం వారి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలు, అంధ విశ్వాసాలు ప్రజల ఆలోచనా శక్తిని కట్టడి చేస్తున్నాయని అన్నారు. వాటిని తొలగించేందుకు తార్కిక దృక్పథం అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత శాస్త్ర విజ్ఞానాన్ని పాఠ్య పుస్తకాలకే పరిమితం చేయకుండా దైనందిన జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. ప్రశ్నించే మనస్తత్వం అలవాటు పడితేనే వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎం. శ్రీనివాస్, పి. నాగరాజులు మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆరోగ్యం, పర్యావరణం, సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, మూఢనమ్మకాలపై నిరంతరం ఉద్యమాత్మకంగా పనిచేస్తున్నామని చెప్పారు. జిల్లా స్థాయిలో రూపొందించిన సైన్స్ క్యాలెండర్ ద్వారా పిల్లల్లో, యువతలో శాస్త్రీయ దృక్పథం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా అధ్యక్షులు తోట శ్రీనివాస్, నాయకులు సిహెచ్. ప్రభాకర్, శశిధర్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కాలనీలలో పాదయాత్ర






**చర్లపల్లి, జనవరి 07, (తెలంగాణ దిశ)** :ప్రజా సమస్యల పరిష్కారం కోసమే కాలనీలలో పాదయాత్రలో నిర్వహిస్తున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మరెడ్డి తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ కృష్ణారెడ్డి నగర్ లో బుధవారం ఆయన కాలనీ వాసులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రాంతంలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర మౌలిక వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.
తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి జరగాలన్నదే లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు వచ్చేలా జీఓ సవరించాలి

## - ప్రెస్ అకాడమీ చైర్మన్ కు టిఎస్ జెయు జిల్లా అధ్యక్షులు ఉదయ్ ధీర్ వినతి



**మహబూబాబాద్,జనవరి 07, (తెలంగాణ దిశ)** :ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియావర్కింగ్ జర్నలిస్ట్ లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అక్రిడిటేషన్లు మంజూరీ చేసేలా ప్రభుత్వానికి నివేదిక అందించాలనిమహబూబాబాద్ జిల్లాలో సెమినార్ కు సందర్భంగా ప్రెస్ అకాడమీ చైర్మన్ . శ్రీనివాస్ రెడ్డికి తెలంగాణా స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిర్రగోని ఉదయ్ ధీర్ కార్యదర్శి పోతుగంటి సతీష్ తో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల కొంతమంది వర్కింగ్ జర్నలిస్టులు ప్రభుత్వం అందించే అక్రిడిటేషన్ కార్డులకు దూరమయ్యేలా ఉందని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జీఓలో కొన్ని సవరణలు చేసి అందరికీ న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. అదే విధంగా వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షమ ఫలాలు అందేలా ప్రభుత్వాన్ని ఒప్పించేలా నివేదిక అందించాలని కోరుతూ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

# సంపాదకీయం

## దిగొస్తున్న అగ్రరాజ్యం..

రాబోయే పదేళ్లలో రక్షణ రంగంలో సహకారం పెంపొందించుకోవడానికి వీలైన మౌలిక విధానంపై భారత్, అమెరికా మధ్య ఒక ఒప్పందం కుదిరింది. అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మధ్య కౌలాలంపూర్‌లో జరిగిన సమావేశం తర్వాత ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. 'ఈ ఒప్పందం సమన్వయం, సమాచార మార్పిడి, సాంకేతిక సహకారాన్ని పెంపొందిస్తుంది. ప్రాంతీయ స్థిరత్వాన్ని పెంచుతుంది. సంఘర్షణలు పెరగకుండా నివారిస్తుంది' అని పీట్ హెగ్సేత్ ఎక్స్‌లో రాశారు. అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, భారత్‌పై 50 శాతం సుంకాలు విధించాక, ఉద్రిక్తంగా మారిన సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నవేళ, రెండుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందానికి తుదిరూపు ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్న సమయంలో ఈ ఒప్పందం కుదిరింది. ట్రంప్ టారిఫ్‌లలో రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసినందుకు జరిమానాగా విధించిన 25 శాతం కూడా కలిసి ఉంది. 'ఇప్పటికే బలంగా ఉన్న మన రక్షణ భాగస్వామ్యంలో ఈ ఒప్పందం ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. ద్వైపాక్షిక సంబంధాల్లో రక్షణ అనేది మూల స్తంభంగా ఉంటుంది. స్వేచ్ఛాయుత, బహిరంగ, నియమ నిబంధనలకు కట్టుబడి ఉండే ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని సురక్షితంగా మార్చడానికి ఈ ఒప్పందం చాలా ముఖ్యం' అంటూ భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ ఒప్పందం గురించి సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రెండు దేశాల మధ్య టారిఫ్ వివాదాల ప్రభావం గురించి యురేషియా గ్రూప్ థింక్ ట్యాంక్ ప్రమిత్ పాల్ చౌధరీని బీబీసీ ప్రతినిధి షెర్లిన్ మోలాన్ ప్రశ్నించారు. 'ఈ ఒప్పందం ఈ ఏడాది జులై-ఆగస్టులో పూర్తి కావాల్సింది. కానీ, పాకిస్తాన్‌తో సంఘర్షణను ముగించానంటూ ట్రంప్ చేసిన ప్రకటనలపై భారత్ అసంతృప్తి చెందడం వల్ల అది ఆలస్యమైంది' అని ప్రమిత్ పాల్ అన్నారు. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాల శ్రేణిలో ఇది తాజా ఒప్పందమని ప్రమిత్ పాల్ వ్యాఖ్యానించారు. 'ఈ ఒప్పందం రెండు దేశాల సైన్యాల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది. భారత్‌కు సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. రక్షణ రంగంలో రెండు దేశాల సైన్యాలు కలిసి పనిచేయడం సులభమవుతుంది' అని ఆయన అన్నారు. ఇటీవలి కాలంలో భారత్, అమెరికా తమ రక్షణ సంబంధాలను బలోపేతం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికాలో పర్యటించారు. ట్రంప్‌తో జరిగిన చర్చల్లో రక్షణ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. భారత్‌కు సైనిక సామగ్రి విక్రయాలను అనేక బిలియన్ డాలర్లకు పెంచుతానని, దీంతో భారత్‌కు ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాలు లభించే మార్గం తెరుచుకుంటుందని ట్రంప్ అన్నారు. కానీ అప్పటి నుంచి, రష్యా నుంచి చౌకగా భారత్ చమురును కొనడం, రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల రక్షణ సంబంధాలు ట్రంప్ ప్రభుత్వానికి ఆందోళన కలిగించే అంశాలుగా మారాయి. రెండు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందం ఎంత ముఖ్యమైనదని సనా హష్మీని ఆయన అడిగారు. 'ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. ట్రంప్ ట్వీట్లకు, ఆయన సోషల్ మీడియా కార్యకలాపాలకు మనం చాలా ప్రాముఖ్యం ఇస్తున్నామని అనుకుంటున్నా. వీటి ఆధారంగానే మనం భారత్-అమెరికా సంబంధాలను అంచనా వేస్తున్నాం. రెండు దేశాల మధ్య సంబంధాల్లో చీలిక ఏర్పడిందని చెబుతున్నాం. ఎవరైనా ఒక నాయకుడి మూలంగా ఒక రెండు దేశాల సంబంధాలు పెద్దగా ప్రభావితం కావు. ట్రంప్ పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పుడున్న పరిస్థితి మారుతుంది' అని సనా హష్మీ అభిప్రాయపడ్డారు. దక్షిణ కొరియాలో డోనల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ సమావేశమయ్యారు. చైనాపై విధించిన 'ఫెంటానిల్ టారిఫ్' లను కుదిస్తున్నట్లు ఆ సమావేశం తర్వాత ట్రంప్ ప్రకటించారు. ట్రంప్ షీ జిన్‌పింగ్ కలుసుకున్నప్పటికీ వారిద్దరి మధ్య సంబంధాలు సానుకూల దిశలో వెళ్తున్నాయని మనం చెప్పలేం. చైనాను ఎదుర్కోవడానికి అమెరికాకు భారత్ సహాయం చాలా అవసరం. ఇప్పటికీ అమెరికా దృష్టిలో భారత్ ప్రాధాన్యం చెక్కుచెదరకుండా అలాగే ఉంది. భారత్ పట్ల అమెరికా ఇప్పటికీ సానుకూలంగా ఉందని చెప్పడానికి తాజాగా కుదిరిన ఈ ఒప్పందమే నిదర్శనం. సుంకాల వివాదం, రష్యాతో భారత్ సంబంధాల తర్వాత కూడా భారత్‌తో అమెరికా ఈ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ట్రంప్ ఏం చెప్పినా రెండు దేశాల మధ్య రక్షణ సంబంధాలు పెరుగుతూనే ఉంటాయి. ఈ ఒప్పందం భారత్ కంటే అమెరికాకే చాలా ముఖ్యమని భావిస్తున్నా' అని సనా హష్మీ అన్నారు. రష్యా ఇప్పటికీ భారత్‌కు ప్రధాన ఆయుధ సరఫరాదారుగా ఉంది. అయితే, భారత్ ఆయుధాల్లో వైవిధ్యాన్ని, దేశీయ సామర్థ్యాన్ని పెంచడానికి ప్రయత్నిస్తున్నందున భారత రక్షణ కొనుగోళ్లలో రష్యా వాటా క్రమంగా తగ్గుతోంది. అమెరికా నుంచి చమురు, రక్షణ కొనుగోళ్లను పెంచడానికి సిద్ధంగా ఉన్నట్లు భారత్ ఇటీవల సంకేతాలు ఇచ్చింది. ప్రస్తుతం భారత్, అమెరికా అత్యంత కీలకమైన వాణిజ్య ఒప్పందంలో నిమగ్నమై ఉన్నాయి. నవంబర్‌లో ఒక ఒప్పందానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. చాలా కాలంగా దీనికోసం ఎదురుచూస్తు న్నాయి. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు 'శిక్ష'గా అభివర్ణిస్తూ ఈ ఏడాది ఆగస్టులో భారత దిగుమతులపై అమెరికా 50% సుంకం విధించింది. భారత్ ఈ విషయంలో జాగ్రత్తగా స్పందించింది. దేశీయ వినియోగదారుల ప్రయోజనాల కోసమే చమురు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ అతి త్వరలో గణనీయంగా తగ్గిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ తనతో చెప్పారని ఇటీవలి కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనేక సార్లు అన్నారు. భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు. నిరుడు రష్యా నుంచి 52.7 బిలియన్ డాలర్ల విలువైన ముడి చమురును కొనుగోలు చేసింది.

# క్రషర్ యజమానులకు మింగుడు పడని నిబంధనలు..!

రంగారెడ్డి, : గనులలో జరుగుతున్న అక్రమాలను నియంత్రించడానికి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించగా, క్రషర్ యజమానులు కొత్త ఎత్తుగడలు వేశారు. అక్రమాలు నియంత్రిస్తే ప్రజలపైనే భారం పడుతుందని ప్రచారం చేయడమే గాక, ధరలు అమాంతం పెంచేశారు. అక్రమాలకు పాల్పడి ప్రజలకు తక్కువ ధరకు కంకర, రోబో సాండ్ సరఫరా చేసామని, ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనల వల్ల ధరలు పెంచక తప్పదని వినియోగదారులతో అంటున్నారు. ధరల పెరుగుదలకు ప్రభుత్వమే కారణమని దుష్ప్రచారం చేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో మొన్నటి వరకు రోబోసాండ్ టన్నుకు రూ.450 కి విక్రయించగా, ప్రస్తుతం రూ.580 కి పెంచారు. 20 ఎంఎం కంకర రూ.450 నుంచి రూ.600, 10 ఎంఎం కంకర రూ.400 నుంచి రూ.580,40 ఎంఎం కంకర రూ.580 కి పెంచారు. టన్నుకు రూ.130 నుంచి రూ.150 వరకు పెంచడంతో వినియోగదారులపై తీవ్రంగా భారం పడుతోంది.

గతంలో క్వారీల నుంచి తరలించే కంకరకు టన్ను చొప్పున రాయల్టీ చెల్లించేవారు. ప్రభుత్వం ఈ విధానాన్ని మార్పు చేసింది. కొత్త నిబంధనలతో ఇటీవల జీవో జారీ చేసింది. ఇకనుంచి క్రషర్ల వాడిన విద్యుత్ యూనిట్ల ఆధారంగా రాయల్టీ వసూలు చేస్తారు. ఒక క్రషర్ కు ఒక నెలలో లక్ష రూపాయల కరెంటు బిల్లు వస్తే 25% అంటే రూ. 25 వేల వరకు రాయల్టీ చెల్లించాలి. ఈ నిబంధన ఉల్లంఘిస్తే రెట్టింపు జరిమానా విధిస్తారు. ఇంతకుముందు టన్ను కంకరకు రూ.150, ఇసుకకు రూ.40 వసూలు చేసేవారు. ఇష్టానుసారంగా తవ్వకాలు జరిపి పెద్ద మొత్తంలో కంకర తరలిస్తూ నామమాత్రంగా రాయల్టీ చెల్లించేవారు. అధికారుల సైతం లోపాయికారి ఒప్పందంతో అక్రమాలను నియంత్రించలేదు. జిల్లాలో 16 క్రషర్లు పనిచేస్తున్నాయి. ఇందులో కొన్నింటికే వే బ్రిడ్జిలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం కాంటా తప్పనిసరి ఉండాలి. కంకర తీసుకెళ్లే సమయంలో తూకం వేసి అందుకు అనుగుణంగా రాయల్టీ చెల్లించాలి. వినియోగదారులకు టన్నుల చొప్పున విక్రయిస్తారు. అయితే తూకం బయట వేస్తున్నారు. కొత్త నిబంధనల ప్రకారం క్రషర్ వద్ద తప్పనిసరిగా వే బ్రిడ్జ్ ఉండాలి. ఇది జిల్లా గనుల శాఖకు అనుసంధానమై ఉంటుంది. కంకర ఎంత కాంటావేశారు? ఎంత తరలిస్తున్నారు? అదనంగా ఏమైనా దాటిస్తున్నారా? అనేది అధికారులు నిరంతరం పరిశీలిస్తారు. అంతేగాక తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలలో నిరంతరం పరిశీలిస్తారు. సీసీ కెమెరా, వే బ్రిడ్జిలు నెల రోజుల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అక్రమాలతో ధనార్జనకు అలవాటుపడిన క్రషర్ యజమానులకు ప్రభుత్వం జారీ చేసిన కొత్త నిబంధనలు మింగుడు పడడం లేదు. ఇప్పటివరకు క్రషర్ యజమానులు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. కేటాయించిన విస్తీర్ణంలో కాకుండా చుట్టుపక్కల కూడా పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టారు.

కొన్నిచోట్ల చాలా లోతుగా ఇష్టానుసారంగా తవ్వకాలు చేశారు. అంతేగాక అక్రమ పేలుళ్లు కూడా జరిపారు. వెలికి తీసిన కంకర కు లెక్క పత్రం ఏమీ లేదు. పరిమితికి మించి టిప్పర్లలో రవాణా చేశారు. రవాణా సమయంలో నిబంధనలు ఉల్లంఘించారు. ఓవర్ లోడ్ వల్ల రోడ్లు ధ్వంశమయ్యాయి. రోడ్లమీద కంకర పడడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్రషర్ యజమానులు కేవలం ధనార్జన పైనే దృష్టి పెట్టారు. కొన్నిచోట్ల దౌర్జన్యాలకు పాల్పడ్డారు. క్రషర్ వద్దకు ఎవరిని రానీయకుండా సెక్యూరిటీ ఏర్పాటు చేసుకున్నారు. మేడ్చల్ జిల్లాలో రాజకీయ నాయకులకు, వారి బంధువులకు క్రషర్లు ఉన్నాయి. వీరు ఎవరు కూడా నిబంధనలు పాటించలేదు.

# ఆదాయంపై ఆందోళన

### జిఎస్‌టి తగ్గడంతో ప్రత్యామ్నాయాల పరిశీలన




హైదరాబాద్: జిఎస్‌టి సంస్కరణల వల్ల ఆదాయం తగ్గడంపై ఆర్థికశాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలన్న కోణంలో అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. గతంలో ఆదాయం పెంపుకోసం డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్, కొంతమంది నిపుణులు ఇచ్చిన సూచనలను ఇప్పుడు తెరపైకి తీసుకువస్తున్నారు. ఈ సూచనలు అమలు చేస్తే ప్రజలపై ఎంతో కొంత భారం తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అక్టోబర్ నెలకు సంబంధించిన గణాంకాల మేరకు గతఏడాది కన్నా 325 కోట్లు జిఎస్‌టి తగ్గినట్లు తేలడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. అలాగే సెప్టెంబర్‌కన్నా కూడా అక్టోబర్‌లో 163 కోట్లు తగ్గినట్లు తేలింది. వాస్తవానికి జిఎస్‌టి-2 ప్రకటించిన వెంటనే కనీసం ఎనిమిది వేల కోట్లు తగ్గుదల ఉంటుందని ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేయడం తెలిసిందే.

అందుకే ఈ నష్టాన్ని భర్తీ చేసుకునేరదుకు కొన్ని ప్రతిపాదనలు కూడా సిద్ధం చేసింది. గతంలో డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ కూడా ఆదాయం పెంపుకోసం కొన్ని ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుంచింది. ఇప్పుడు ఆ ప్రతిపాదనల నే ప్రభుత్వం తెరపైకి తీసుకువస్తోంది. గత కలెక్టర్ల సదస్సులో కూడా జిఎస్‌టి నష్టాలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లకు దిశా నిర్దేశం చేయగా, ఇప్పుడు ఆ ఆదేశాలను కఠినంగా అమలు చేయాలని మరోసారి స్పష్టం చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

పెండింగ్ బకాయిలను ముక్కుపిండి వసూలు చేయడం, ఎగవేతదారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేసి కేసులు పెట్టడం, చిరు వ్యాపారులు కూడా తప్పనిసరిగా పన్నులు చెల్లించేలా చూసేందుకు తప్పనిసరి రిజిస్ట్రేషన్లు అమలు చేయడం వంటి చర్యలను తప్పనిసరిగా అమలుచేయనున్నారని సమాచారం. పథకాల స్థానంలోనగదు బదిలీ..: ఇన్నాళ్లూ పథకాలకు ఇస్తున్న రాయితీలపైనా మరోసారి దృష్టి సారిస్తున్నారు. గతంలోనే డిఆర్ఐ ఇచ్చిన నివేదికను ఇప్పుడు బయటకు తీసి పథకాల స్థానంలో నగదు బదిలీ చేయాలని, అది కూడాఅర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలన్న నిర్ణయాన్ని త్వరలో అమ లుచేయాలని భావిస్తున్నట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితం దీనిపైనాచర్చ సాగినట్లు అధికారులు చెబుతున్నారు. దీనివల్ల కొంతవరకు వ్యయం తగ్గుతుం దనిఆర్థికశాఖ చెబుతోంది. మద్యం, గనులపై దృష్టి:ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో గనులశాఖ, మద్యం శాఖల పైనా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. కొత్తగా అదనపు వ్యాట్ విధించే అవకాశాలు న్నాయని ఒక అధికారి చెప్పారు. అలాగే గనుల ద్వారా వచ్చేఆదాయం నామనాత్రంగా ఉంటోందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. పర్యాటక రంగంలో కూడా ఫీజులను పెంచడం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని యోచిస్తున్నారు.

## బ్రెజిల్‌లో సుడిగాలుల బీభత్సం - ఐదుగురు మృత్యువాత

బ్రసిల్లా:దక్షిణ బ్రెజిల్‌లోని ఒక పట్టణంలో కొన్ని ప్రాంతా లను సుడిగాలి తుడిచి పెట్టింది. ఈ సుడిగాలికి ఐదుగురు మృత్యువా తపడ్డారు. 130 మందికి గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. పరానా రాష్ట్రంలోని రియో బోనిటో డో ఇగువాకు అనే మునిసిపాలిటీ లో సంభవించిన సుడిగాలి వల్ల కార్లు బోల్తాపడ్డాయి. ఇళ్లు దెబ్బతిన్నా యి అని స్థానిక వాతావరణ శాఖ తెలిపింది. ఈ సుడిగాలికి ఐదుగురు మృతి చెందినట్లు నిర్ధారించినట్లు పరానా పౌర రక్షణ శాఖ ఓ ప్రకటనలో నివేదించింది. ఈ ఘటనలో 30 మందికి తీవ్రగాయాల య్యాయని, వంద మందికి మాత్రం స్వల్పగాయాలయ్యాయని స్థానిక రెస్క్యూ ఏజెన్సీ తెలిపింది. 14 వేల జనాభా కలిగిన రియో బోనిటో డో ఇగువాకులో గంటకు 180 నుండి 250 కిలోమీటర్ల వేగంతో వీచినట్లు పరానా పర్యావరణ వాతావరణ శాఖ తెలిపింది. ఈ విపరీతమైన గాలుల వల్ల చెట్లు కూలిపోయాయి. రాతి భవనాలకు కూడా నష్ట వాటిల్లిందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ ఘటనపై పరానా గవర్నర్ రతినో జూనియర్ స్పందించారు. భద్రతా బలగాలు అప్రమత్తమై ఈ తీవ్ర తుఫానుల బారినపడిన నగరాలను పర్యవేక్షిస్తున్నాయని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో తెలిపారు. పరానాతోపాటు దక్షిణ రాష్టాలైన్ర శాంటా కాటరినా, రియో గ్రాండేడో సుల్‌లకు కూడా తుఫానులు సంభవించవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## గన్ని సంచుల సరఫరా వేగవంతం..

### 48 గంటల్లో కేంద్రాలకు చేరవేత

### జిల్లాలో ఎక్కడా గన్ని సంచుల కొరత లేదని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి స్పష్టం

ఖమ్మం : ధాన్యం కొనుగోలుకు అవసరమైన మేర గన్ని సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, కొనుగోలు కేంద్రాల నుంచి ప్రతిపాదనలు అందిన 48 గంటలలోపే గన్ని సంచుల సరఫరా పూర్తవుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు తదితర అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు అవసరాలకే గన్ని సంచులు పంపిణీ చేయాలని, రైతుల ఇళ్లకు సంచులు ఇవ్వవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు 9 లక్షల 71 వేల 500 గన్ని సంచులు పంపిణీ పూర్తి అయిందని, గన్ని సంచుల కోసం ఇండెంట్ పెట్టిన 48 గంటల లోపే సరఫరా పూర్తవుతోందని, జిల్లాలో ఎక్కడా గన్ని సంచుల కొరత లేదని అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఒకే ప్రపంచం – ఒకే ట్రంప్...

దిక్కుమాలిన చరిత్రకు డీలక్స్ ఎడిషన్!
ఏం రాజకీయాలివి రా బాబోయ్!
ఇది జియోపాలిటిక్స్ కాదు,
ఇది ట్రంప్-టోపీలిటిక్స్!
మ్యాప్‌లపై గీతలు కాదు,
ట్విటర్‌లో మూడ్ స్వింగ్స్!
బాంబులకి తర్కం లేదు,
అబద్ధాలకి మాత్రం మెరిసే బ్రాండింగ్!
"శాంతి" అన్న మాట
ట్రంప్ నోట్లో పాప్‌కార్న్ లాంటిది ం
నోరు తెరిస్తే చప్పుళ్లే,
లోపల అర్థం శూన్యం!
ఇండియాఉపాక్ సరిహద్దా?
ఓ రెండు ట్వీట్లు చాలు!
మెక్‌డొనాల్డ్స్ సాస్‌తో రాసిన
మూడు లైన్లతోనే
కశ్మీర్ సమస్య 'లాగౌట్గ!
వార్ అండ్ పీస్, ట్రంప్ స్పెషల్ ఎడిషన్!
ఆర్డర్ చేసేది డైట్ కోక్,
డెలివరీ మాత్రం బాంబులే!
టేబుల్ మీద నాప్‌కిన్,
మ్యాప్ మీద నాపామ్!
ఇరాన్ దగ్గర
"మాట్లాడుకుందాం" అన్నాడు,
గుండెల్లోకి మాత్రం
రైఫిళ్లు పంపించాడు!
పెంటగాన్ అడ్డుకుంది,
"సార్, యుద్ధం వద్దు!"
అతను నవ్వాడు ం
"ఓకే ఇది యుద్ధం కాదు,
ఇది రక్షణగా దాడి!"
ఇది ఫారిన్ పాలసీనా రా?
క్రాస్‌వర్డ్ కాదూ
పీకలోతు పిచ్చి!
ఇప్పుడు చూడు వెనిజువేలా!
చమురు వాసన వచ్చిందంటే చాలు,
సార్వభౌమత్వం మంటగలిపాడు!
దేశం మీద ఆంక్షలు,
ప్రజల మీద శిక్షలు,
ఎన్నుకున్న నాయకుల్ని
సూట్‌కేసుల్లో ప్యాక్ చేసి
"డెమోక్రసీ ఎక్స్‌పోర్టు పేరుతో
విమానాల్లో తరలింపు!
ఏమిది?
ఎన్నికలు నచ్చలేదా?
అయితే నాయకుడినే ఎత్తుకుపో!
ఇదేనా కొత్త అంతర్జాతీయ న్యాయం?
"మేము విముక్తి ఇస్తున్నాం" అంటాడు,
కానీ చేతిలో ఉన్నది
సంకెళ్లే!
వెనిజువేలా కాదు,
ఇది ట్రంప్ ప్రయోగశాల,
దేశాలు ఎలుకలు!
ఇప్పుడు మునీర్‌తో లంచ్,
రేపు ఎవరోతో డిన్నర్!
పాకిస్తాన్ మీద ప్రేమా?
కాదురా అది వ్యూహం!
ఇండియాకు మత్తు,
చైనాకు టిఫిన్,
మిగతావాళ్లకి బాంబు!
అమెరికా గంభీరంగా నిలుస్తోంది అంటారు,
కానీ వెనక తాడులు లాగేది
ఈ రంగుల జోకర్!
**Make America Great Again** కాదు ఇది,
**Make the World a Joke Again!**
ఒక్క మనిషి ఒక్క ట్వీట్
ఒక్కో ఖండానికి ఒక్కో సంక్షభం!
ఐక్యత బురదలో,
నైతికత పాత పాఠ్యపుస్తకాల్లో,
అంతర్జాతీయ చట్టం
ఫుట్‌నోట్‌లో!
ట్రంప్ మాస్టారు వేదిక్కారు
పగిలిపోయిన విశ్వ రాజకీయాల్ని
గాజుబొమ్మలుగా చేసి,
సర్కస్‌లో ఊపుతున్నారు!
ఒకే ప్రపంచం
ఒకే ట్రంప్ ప్రపంచం
ఇది పరిపాలన కాదు,
ఈ నాటకానికి పేరు,
"గ్లోబల్ సర్కస్!"



- రాయరావు
రామ్మోహన్ రావు
విశ్రాంత ప్రొఫెసర్

# పీఓకే దిశగా అడుగులు పడుతున్నాయా..?

దేశ విభజన సమయంలో అప్పటి కశ్మీర్ రాజు హరిసింగ్ తన రాజ్యాన్ని భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు పలు ప్రయత్నాల తర్వాత అంగీకరించారు. ఆ ప్రక్రియ సాంకేతికంగా పూర్తియింది. కాని వాస్తవ స్థితిని చూసినపుడు, కశ్మీర్‌లో కొంతభాగం పాకిస్థాన్ ఆక్రమణకు గురై ఇప్పటికీ వారి అధీనంలోనే ఉంది. ఈ భాగం, ఆ భాగం అని గాక మొత్తం కశ్మీర్ ప్రశ్నపై రెండు దేశాల మధ్య జరిగిన యుద్ధాలలో ఏమీ తేలలేదు. భారత సైన్యం తూర్పు పాకిస్థాన్‌ను విడదీసి అక్కడి పాకిస్థాన్ సైన్యాన్ని పెద్ద సంఖ్యలో బందీగా పట్టుకున్నపుడు, పిఒకెను మనకు వదలుకున్నట్లయితేనే ఆ బందీలను వదలగలమనే షరతు విధించవలసిందనే అభిప్రాయం ఒకటుంది. ఎందుకైతేనేమి అది జరగలేదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంత కాలం, కశ్మీర్ సరిహద్దు వివాద పరిష్కారంపై చర్చలు జరిగాయి గాని, పిఒకెను సైనికంగా స్వాధీన పరచుకోవడమనే అంశం అజెండా పైకి రాలేదు. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చినప్పటి నుంచి పిఒకె స్వాధీనం ప్రస్తావనలు వస్తున్నాయి. ఎప్పటికైనా ఆ పని చేస్తామంటున్నారు. ఆయన నాయకత్వాన గత ప్రధాని వాజపేయికి మించి తీవ్ర జాతీయవాద వైఖరిని అవలంబిస్తున్నందున అటువంటి ప్రస్తావనలు సహజమనాలి. ఆ ధోరణికి అనుగుణంగానే ఆయన ప్రభుత్వం, కశ్మీర్ వివాదమంటూ అసలు ఏమీ లేదని, దానిపై పాకిస్థాన్‌తో చర్చించవలసింది కూడా ఏమీ లేదని, చర్చించటమంటూ ఉంటే వారు పిఒకెను మనకు వశపరచటం గురించి మాత్రమేనని అంటూ వస్తున్నది. అందుకు పొడిగింపుగా మాట్లాడుతూ, మనమే ఒక రోజు ఆ భూభాగాన్ని స్వాధీనపరచుకోగలమని చెప్తున్నది. దీనంతటిలోని సాంకేతికతలను అట్లుంచితే, ఆచరణకు సంబంధించిన ప్రశ్నలు కొన్నింటిని గమనించవలసి ఉంటుంది. ఆ విధమైన ఆక్రమణ సాధ్యమా అన్నది ఒక ప్రశ్న కాగా, ఒకవేళ ఆక్రమించినా దానిని అధీనంలో ఉంచుకుని నియంత్రించగలరా అన్నది మరొక ప్రశ్న. యుద్ధాలు, ఆక్రమణలు, నియంత్రణలు అనే మూడు కూడా ఆషామాషీ విషయాలు కావు. అందువల్ల ఆవేశంతోగాక జాగ్రత్తగా ఆలోచించవలసి ఉంటుంది. మొదట యుద్ధం మాట చూస్తే, పాకిస్థాన్ కన్న ఇండియా చాలా శక్తివంతమైనదని వేరే చెప్పనక్కరలేదు. కాని ఇరువురికి అణ్వస్త్రాలు ఉండటం విస్మరించలేనిది. పాకిస్థాన్ 'న్యూక్లియర్ విధానం' ప్రకారం, తమ భూభాగానికి, భౌగోళిక సమగ్రతకు ముప్పు ఏర్పడినట్లయితే అణ్వస్త్రాలు ఉపయోగిస్తారు. ఆ పని నిజంగా జరుగుతుందా అనేది వేరే విషయం. కాని, జరగదని కూడా ఎవరూ హామీ ఇవ్వలేరు. ఒకసారి తూర్పు పాకిస్థాన్‌ను కోల్పోయిన తర్వాత, మరొక భూభాగాన్ని పోగొట్టుకునేందుకు సిద్ధపడటం తేలిక కాదు. అందువల్ల, పిఒకెను స్వాధీనపరచుకునే లక్షంతోనే యుద్ధమన్నది తేలిక కాదు. ఆ స్థాయి యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా జోక్యమన్నది సరేసరి.

# పరగడుపునే బెల్లం నీళ్లను తాగితే ఇన్ని ఉపయోగాలు ఉన్నాయా..?



బెల్లాన్ని సహజసిద్ధమైన పద్ధతిలో తయారు చేస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అందుకనే తీపి తినాలనుకునే వారు చక్కెరకు బదులుగా బెల్లం తింటే మంచిదని వైద్య నిపుణులు కూడా చెబుతుంటారు. అయితే రోజూ బెల్లం తినడం కష్టం అనుకునే వారు బెల్లాన్ని నీటిలో కలిపి కూడా తాగవచ్చు. ఈ విధంగా బెల్లం నీళ్లను తాగడం వల్ల కూడా మనకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. చిన్న బెల్లం ముక్కను రాత్రి పూట ఒక గ్లాస్ నీటిలో నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ నీళ్లను సేవించాలి. దంతాలను తోముకున్న తరువాతే ఈ నీళ్లను తాగాలి. ఉదయం బెల్లం నీళ్లను సేవిస్తే శరీరానికి శక్తి లభిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట ఉండవు.


రోగాల నుంచి రక్షణ..: బెల్లం నీళ్లను తాగడం వల్ల జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. జీర్ణాశయంలో ఎంజైమ్ ఉత్పత్తి పెరుగుతుంది. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. బెల్లం నీళ్లను తాగడం వల్ల లివర్ శుభ్రంగా మారుతుంది. లివర్‌లోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్‌లోని కొవ్వు కరుగుతుంది. ఫ్యాటీ లివర్ ఉన్నవారు బెల్లం నీళ్లను తాగుతుంటే ఫలితం ఉంటుంది. బెల్లంలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌తో పోరాటం చేస్తాయి. కణాలు దెబ్బ తినకుండా చూస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. బెల్లంలో అనేక యాంటీ ఆక్సిడెంట్లతోపాటు మినరల్స్ కూడా ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తాయి. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది.

రక్తహీనతకు ఔషధం..: బెల్లంలో ఉండే ఐరన్, ఫోలేట్ మహిళలకు ఎంతో మేలు చేస్తాయి. వారిలో నెలసరి సమయంలో వచ్చే నొప్పులను తగ్గిస్తాయి. తీవ్ర రక్త స్రావం జరగకుండా చూస్తాయి. అలాగే ఈ నీళ్లను తాగడం వల్ల రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. బెల్లంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ నీళ్లు ఎంతో మేలు చేస్తాయి. అలాగే బెల్లం నీళ్లను తాగితే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బెల్లం నీళ్లను తాగడం వల్ల లభించే మినరల్స్ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరిసేలా చేస్తాయి.

రాత్రి కూడా తాగవచ్చు..: బెల్లం నీళ్లను ఉదయం తాగడం వీలు కాదు అనుకునే వారు రాత్రి పూట భోజనం చేసిన తరువాత లేదా నిద్రకు ముందు తాగవచ్చు. అయితే బెల్లం శరీరంలో వేడిని పెంచుతుంది. కనుక బెల్లం నీళ్లను చల్లగా తాగితే మేలు. ఈ నీళ్లను తాగితే కొందరికి పడకపోవచ్చు.

విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు ఈ నీళ్లను తాగకపోవడమే మంచిది. నాణ్యమైన బెల్లంతో తయారు చేసిన నీళ్లనే తాగాలి. బెల్లం క్వాలిటీగా లేకపోయినా కూడా అనారోగ్య సమస్యలు వస్తాయి. శారీరక శ్రమ లేదా వ్యాయామం చేసేవారు పని ముగిసిన తరువాత బెల్లం నీళ్లను తాగితే శరీరానికి శక్తి లభిస్తుంది. మళ్లీ ఉత్సాహంగా మారుతారు. ఇలా బెల్లం నీళ్లను సేవించడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# గుండె ఇలా పదిలం



గుండె ఆరోగ్యం కోసం రాత్రికి రాత్రే జీవితాన్ని పూర్తిగా మార్చుకోవాల్సిన అవసరం లేదు. చిన్నచిన్న, స్థిరమైన మార్పులు.. మీ హృదయాన్ని రక్షించడంలో సహాయపడతాయి. అందుకోసం కింది చిట్కాలను పాటిస్తే సరి.. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల నడక.. గుండె ఆరోగ్యాన్ని రెట్టింపు చేస్తుంది. నాలుకకు నచ్చేలా కాదు.. మనసుకు నచ్చేలా తినండి. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటూ.. కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వులకు ఆహారంలో చోటివ్వండి. నిద్రకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వండి. ప్రతిరోజూ రాత్రిపూట 7 నుంచి 9 గంటల నాణ్యమైన నిద్ర ఉండేలా చూసుకోండి. ధూమపానం, మద్యపానం అలవాటు ఉంటే.. వెంటనే మానేయండి. ఇంట్లో ఎవరైనా ధూమపానం చేస్తుంటే.. వారికి దూరంగా ఉండాలి. ఒత్తిడి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంచుకోవడానికి యోగా, ధ్యానం లాంటివి ప్రయత్నించండి.

# ఈ బెర్రీలను ఎప్పుడైనా తిన్నారా..?

## వీటితో కలిగే లాభాలు తెలిస్తే షాకవుతారు..!

బెర్రీలు.. ఈ పండ్ల పేరు చెప్పగానే మనకు స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలు, బ్లూబెర్రీల వంటి పండ్లు గుర్తుకు వస్తాయి. కానీ బెర్రీల్లో ఇంకా అనేక వెరైటీలు ఉన్నాయి. వాటిల్లో రోవాన్ బెర్రీలు కూడా ఒకటి. ఇవి చూసేందుకు చిన్నపాటి చెర్రీ పండ్ల మాదిరిగా ఉంటాయి. ఇవి మనకు ఎక్కువగా సూపర్ మార్కెట్లలోనే లభిస్తాయి. రోవాన్ బెర్రీలను డ్రై ఫ్రూట్స్ రూపంలోనూ విక్రయిస్తారు. అయితే రోవాన్ బెర్రీలలో పారాసోర్బిక్ యాసిడ్ ఉంటుంది. కనుక ఈ పండ్లను నేరుగా తినకూడదు. కాస్త ఉడకబెట్టి లేదా డ్రై ఫ్రూట్స్ రూపంలో తినాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఈ పండ్లను నేరుగా తింటే పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుందని అంటున్నారు. ఇక రోవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలు ఉంటాయని వారు అంటున్నారు.

దయాబెటిస్ ఉన్నవారికి వరం..: రోవాన్ బెర్రీలలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను బలంగా మారుస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీంతో శరీరం వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కొంటుంది. అలాగే ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రోవాన్ బెర్రీలలో పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గేలా చేస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా అడ్డుకోవచ్చు. రోవాన్ బెర్రీలలో సార్బిటాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆల్కహాల్‌కు చెందిన ఒక సమ్మేళనం. ఇది షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తుంది. మధుమేహం ఉన్నవారు రోవాన్ బెర్రీలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఈ బెర్రీలు తియ్యగా ఉన్నప్పటికీ వీటిల్లో ఉండే సార్బిటాల్ కారణంగా వీటిని తింటే షుగర్ లెవల్స్ పెరగవు. పైగా షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తాయి. కనుక దయాబెటిస్ ఉన్నవారికి ఈ పండ్లను వరంగా చెప్పవచ్చు.

మలబద్ధకానికి ఔషధం..: రోవాన్ బెర్రీలు సహజసిద్ధమైన లాక్సేటివ్ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మలబద్ధకం తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. రోవాన్ బెర్రీలలో ఫినోలిక్స్, టెర్పినాయిడ్స్ అనే బయో యాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల ఆర్థరైటిస్ నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. రోవాన్ బెర్రీలలో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను తింటే మన శరీరంలో చేరే బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు నిర్మూలించబడతాయి. ముఖ్యంగా ఇ.కోలి వంటి బ్యాక్టీరియా నాశనం అవుతుంది. దీంతో అనేక వ్యాధుల రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.



వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి..: రోవాన్ బెర్రీలలో కెరోటినాయిడ్స్ అధికంగా ఉంటాయి. లుటీన్ అధికంగా ఉంటుంది. దీని వల్ల కంటి ఆరోగ్యం మెరుగు పడుతుంది. కంటి చూపు పెరుగుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలు రాకుండా అడ్డుకోవచ్చు. రోవాన్ బెర్రీలలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి కొల్లాజెన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు, వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. చర్మం కాంతివంతంగా మారి మెరుస్తుంది. యవ్వనంగా కనిపిస్తారు. రోవాన్ బెర్రీలను ఆహారంలో భాగం చేసుకుంటే వాపులు తగ్గుతాయి. దీంతో గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. ముక్కు దిబ్బడ తగ్గుతుంది. ఇలా రోవాన్ బెర్రీలను తరచూ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.


# సంతాన సఫలతకు వడదెబ్బ

మాతృత్వ మాధుర్యాన్ని కోరుకునే స్త్రీలకు హీట్‌వేవ్ (వడగాలి) ఉపద్రవంలా మారింది. విపరీతమైన ఎండ మహిళల పునరుత్పత్తి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, వేడి వాతావరణం, వడగాలుల కారణంగా మానసికంగా, శారీరకంగా స్త్రీలలో ఒత్తిడి పెరుగుతున్నట్టు వైద్యులు చెబుతున్నారు.

అధిక ఉష్ణోగ్రతలకు ఎక్కువసేపు గురికావడం వల్ల కార్టిసాల్ వంటి ఒత్తిడిని పెంచే హార్మోన్ల ఉత్పత్తి పెరగడం, స్త్రీలలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ వంటి హార్మోన్లపై ప్రభావం చూపుతున్నట్టు పేర్కొంటున్నారు. ఈ హార్మోన్ల అసమతుల్యత కారణంగా రుతుక్రమ సమస్యలు ఉత్పన్నమవుతున్నట్టు చెప్పారు. దీని ప్రభావం అండాల విడుదల (ఓవులేషన్)పై పడుతున్నదని.. ఈ రెండు అంశాలు గర్భధారణకు సవాలుగా మారుతున్నట్టు వెల్లడించారు. వేసవిలో జరిగే ఈ మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉంటే ఇంబాలెన్సెస్ (అసమానతల)ను గుర్తించవచ్చని వైద్యులు అంటున్నారు.

వేసవిలో శరీరం నుంచి చెమట ద్వారా ఎక్కువ ఫ్లూయిడ్స్‌ను కోల్పోతారు. కాబట్టి, ఎప్పటికప్పుడు శరీరానికి అవసరమైన ద్రవ పదార్థాలను తగిన మొత్తంలో తీసుకోవాలని సూచిస్తున్నారు. వీర్యం అండాన్ని చేరడానికి సహాయపడే గర్భాశయ శ్లేష్మం హైడ్రేషన్‌పైనే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. శ్లేష్మం తక్కువగా ఉన్నా.. లేదా మందంగా ఉన్నా.. అది వీర్యం కదలికకు ఆటంకం కలిగిస్తుందని తెలిపారు. గర్భధారణ కోరుకునే మహిళలు వడగాలుల సమయంలో ప్రతీరోజు 8 నుంచి 10 గ్లాసుల నీరు తప్పనిసరిగా తాగడం ద్వారా సంతాన సామర్థ్యం పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.

నిద్ర, పౌష్టికాహారం పునరుత్పత్తికి దోహదపడే హార్మోన్లను నియంత్రించే ప్రక్రియలో నిద్ర కీలక పాత్ర వహిస్తుంది. అయితే, వేసవిలో స్త్రీలకు తగినంత నిద్రపట్టడం కష్టంగా మారుతుంది. నిద్రలేమి కారణంగా మెలటోనిన్ అనే హార్మోన్ స్థాయి తగ్గి అది అండాల విడుదలపై ప్రభావితం చూపుతుందని వైద్యులు తెలిపారు. అందుకే నిద్రపోయేటప్పుడు యూవీ కిరణాలు, సూర్యకాంతి, వేడిని నిరోధించే బ్లాక్ అవుట్ కర్టెన్లు, కాటన్ బెడ్‌షీట్లతోపాటు గది చల్లగా ఉండేలా చూసుకోవాలి. సంతానోత్పత్తికి కంటినిండా నిద్ర కీలకమని సూచిస్తున్నారు. వేసవిలో ప్రయాణాలు కూడా కొన్నిసార్లు రుతుచక్రాన్ని దెబ్బతీస్తాయని.. ప్రయాణాలతో కలిగే ఒత్తిడి కూడా అండాల విడుదలపై ప్రభావం చూపుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వడగాలుల సమయంలో వేడి కారణంగా ఆకలి తగ్గుతుంది. దీంతో కొన్నిసార్లు తక్కువ పోషక పదార్థాలు ఉన్న ఆహారాన్ని తీసుకుంటారు. సంతానోత్పత్తి పౌష్టికాహారంపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, స్త్రీలు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు.



ఈ జాగ్రత్తలు తప్పనిసరి: ఫోలిక్ యాసిడ్, ఐరన్, జింక్, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలు ఆరోగ్యకరమైన అండాల అభివృద్ధికి దోహదపడతాయి. అందువల్ల, ఆయా కాలాల్లో లభించే పండ్లు, ఆకుకూరలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. హైడ్రేటింగ్ సమస్యలను తప్పించుకోవడానికి కొబ్బరినీళ్లు క్రమం తప్పకుండా తాగాలి. వేసవిలో ఎండవేడి మానసిక ఆరోగ్యంపై సైతం ప్రభావితం చూపుతుంది.గర్భందాల్చడానికి ప్రయత్నిస్తున్న స్త్రీలు అప్పటికే భావోద్వేగ ఒత్తిడికి లోనవుతారు. అదనంగా వేసవి కారణంగా ఈ ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఇలాంటప్పుడు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యం ఇవ్వాలని వైద్యులు చెబుతున్నారు. ఎండలో బయటికి వెళ్లినప్పుడు సన్‌స్క్రీన్ లోషన్లు తప్పనిసరిగా వాడాలని, హైడ్రేటెట్‌గా ఉండాలని సూచించారు.

# ఈ చిట్కాలను పాటిస్తే మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి మారి అందంగా కనిపిస్తాయి..!




చర్మం, శిరోజాల తరువాత చాలా మంది అందంగా కనిపించాలని కోరుకునే అవయవాల్లో పెదవులు మూడో స్థానంలో ఉంటాయని చెప్పవచ్చు. మహిళలు ఎక్కువగా పెదవుల అందానికి ప్రాధాన్యతను ఇస్తుంటారు. పెదవులు అందవిహీనంగా కనిపిస్తే ఎవరికీ మనశ్శాంతిగా ఉండదు. పెదవులు పొడిబారడం లేదా నల్లగా మారడం, కాంతిని కోల్పోవడం వంటివి జరుగుతుంటాయి. ఇందుకు అనేక కారణాలుఉంటాయి. అయితే పెదవుల అందానికి ఖరీదైన బ్యూటీ పార్లర్ చికిత్సలు అవసరం లేదు. మన ఇంట్లోఉండే పదార్థాలతోనేఅత్యంత సహజసిద్ధంగా పెదవులను అందంగా మార్చుకోవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. పెదవులను అందంగా మార్చడంలో చక్కెర, తేనె ఎంతగానో ఉపయోగపడతాయి. రెండింటినీ కలిపి పేస్ట్‌లా చేసి పెదవులపై మసాజ్ చేసినట్లు రాయాలి. దీంతో మృత చర్మ కణాలు పోతాయి. పెదవులు కాంతివంతంగా మారి అందంగా కనిపిస్తాయి. ఈ చిట్కాను వారంలో 2 సార్లు పాటించాలి.

తేనె..: పెదవులను అందంగా మార్చడంలో కొబ్బరినూనె కూడా పనిచేస్తుంది. ఈ నూనెను చాలా మంది శిరోజాల సంరక్షణకు ఉపయోగిస్తుంటారు. కానీ కొబ్బరినూనెను రాయడం వల్ల పెదవులు కూడా అందంగా మారి రక్షించబడతాయి. రాత్రి పూట నిద్రకు ముందు కొద్దిగా కొబ్బరినూనెను పెదవులకు మసాజ్ చేసినట్లు రాయాలి. ఉదయం కడిగేయాలి. ఇలా చేస్తుంటే పెదవులు మృదువుగా మారుతాయి. సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి. పెదవులు పొడిబారడం తగ్గుతుంది. తేనె పెదవులకు తేమను అందిస్తుంది. తేనెను కొద్దిగా తీసుకుని పెదవులకు రాసి 20 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే పెదవులు అందంగా మారుతాయి. పెదవులపై ఉండే నలుపు దనం పోతుంది. మృత చర్మ కణాలుతొలగిపోయిపెదవులు కాంతివంతంగా కనిపిస్తాయి.

బీట్ రూట్ జ్యూస్..: పెదవులపై బీట్‌రూట్ జ్యూస్‌ను అప్లై చేయడం వల్ల కూడా ఫలితం ఉంటుంది. కొద్దిగా బీట్ రూట్ జ్యూస్‌లో ముల్లంగి రసం కలిపి పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. రోజూ ఇలా చేస్తుంటే మీ పెదవులపై ఉండే నలుపుదనం తగ్గిపోతుంది. మీ పెదవులు సహజసిద్ధంగా పింక్ రంగులోకి మారుతాయి. కలబంద గుజ్జును కొద్దిగా తీసుకుని పెదవులపై రాసి 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. కలబందలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు పెదవుల వాపులను తగ్గించి ఇన్‌ఫెక్షన్లను దూరం చేస్తాయి. దీంతో పెదవులు సహజసిద్ధమైన నిగారింపును పొందుతాయి. రాత్రి పూట పెదవులపై కాస్త నెయ్యిని రాసి ఉదయం కడిగేస్తున్నా కూడా ఫలితం ఉంటుంది. అయితే నెయ్యిని ఉపయోగించే ముందు కాస్త వేడి చేస్తే మంచిది.

పాలు, గులాబీల మిశ్రమం..: రాత్రంతా గులాబీ పువ్వుల రెక్కలను పాలలో వేసి నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ మిశ్రమాన్ని మెత్తని పేస్ట్‌లా చేయాలి. దాన్ని పెదవులపై రాయాలి. 15 నిమిషాలు అయ్యాక కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే పెదవులు పింక్ రంగులోకి సహజసిద్ధంగా మారిపోతాయి. రాత్రి పూట నిద్రకు ముందు పెదవులపై బాదంనూనెను రాస్తున్నా ప్రయోజనం ఉంటుంది. పెదవులు సురక్షితంగా ఉంటాయి. ఈ విధంగా పలు చిట్కాలను పాటించడం వల్ల పెదవులపై ఉండే మృత చర్మ కణాలను తొలగించడంతోపాటు పెదవులను సహజసిద్ధంగా అందంగా మారేలా చేయవచ్చు.

# పాదాలు పదిలం



శరీరంలో అన్ని భాగాలపై దాడి చేసే వ్యాధి డయాబెటిస్. ఈ వ్యాధి కారణంగా రక్తంలో ఉండే అధిక చక్కెర స్థాయులు కండ్లు, కిడ్నీలు, గుండె ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. అయితే, ఈ అవయవాలు మాత్రమే కాదు మధుమేహ వ్యాధిగ్రస్తుల పాదాలకు కూడా ముప్పు పొంచి ఉంటుంది. మధుమేహ వ్యాధిగ్రస్తుల్లో పాదాల సమస్యలు చాలానే ఉంటాయి. దీన్నే డయాబెటిక్ ఫూట్ అంటారు. ఈ సమస్యకు నిర్ణీత సమయంలో చికిత్స తీసుకోకపోతే పాదాల్లో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. కాబట్టి, పొరపాటున కూడా డయాబెటిక్ ఫూట్ లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదు. నిజానికి మధుమేహ: వ్యాధిగ్రస్తుల్లో అధిక చక్కెర స్థాయులు కాలక్రమంలో నాడులను ధ్వంసం చేస్తాయి. దీన్ని డయాబెటిక్ న్యూరోపతి అని పిలుస్తారు. ఈ పరిస్థితిలో పాదాలకు తగినంతగా రక్త ప్రసారం జరగదు. దీంతో పాదాల్లో నొప్పి, గాయాలను గుర్తించడం కష్టమైపోతుంది. కొన్నిసార్లు ఈ గాయాలు తీవ్రమైన ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి. అవి తగ్గడానికి చాలా సమయం పడుతుంది కూడా!

లక్షణాలు: పాదాలు, వేళ్ల దగ్గర తిమ్మిర్లు, మొద్దుబారినట్టు ఉండటం. కాళ్లలో మంట లేదంటే తీవ్రమైన నొప్పి. తొందరగా నయం కాని పుండ్లు, బొబ్బలు. ఎక్కడో ఓ చోట గాయం. పాదాల చుట్టూతా ఎర్రగా కందిపోవడం, వాపు. పాదాల్లో పగుళ్లు, పొడి చర్మం, రక్తస్రావం. చర్మంపై గాఢమైన నల్లటి మచ్చలు. గాయం నుంచి దుర్వాసన, రసి కారడం. పాదాల్లో ఏదైనా అవకరం.

నివారణ ఎలా?: పాదాలను శుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. గోళ్లు కత్తిరించుకుని, శుభ్రంగా ఉంచుకోవాలి. పాదాలపై పులిపిర్లు, గాయాలు, మంటగా ఉండటం లాంటివాటిని గమనిస్తూ ఉండాలి. పాదాలను గోరువెచ్చటి నీటితో కడుక్కోవాలి. వేళ్ల మధ్య భాగాన్ని పొడిగా ఉంచుకోవాలి. పాదాలకు అసౌకర్యంగా ఉండని తగిన షూస్‌నే ధరించాలి. ధూమపానం చేయొద్దు. ఉట్టి కాళ్లతో నడవకూడదు. వీటికి అదనంగా రక్తంలో చక్కెర స్థాయులను అదుపులో ఉంచుకోవాలి. చక్కెర స్థాయులను క్రమం తప్పకుండా పరీక్షించుకుంటూ ఉండాలి. వైద్యుడి సలహాలను అనుసరించాలి.

# విద్యుత్తు వినియోగదారులపై భారం!



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**టీజీఎస్‌పీడీసీఎల్ తన వినియోగదారులను లక్ష్యంగా చేసుకుంటున్నది. ఆదాయ వనరులను అన్వేషించే క్రమంలో తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు వారికి షాకిస్తున్నాయి. గతంలో 20 కిలోవాట్ల లోడ్ ఉన్న ప్రతి ఇంటికీ ట్రాన్స్‌ఫార్మర్ బిగించాలని నిర్ణయించారు. ఇప్పుడు మాత్రం వినియోగదారులు అడిగినంత లోడ్ ఇవ్వకుండా ఇంట్లో ఉన్న గదుల ప్రకారం విద్యుత్తు సంస్థే లోడ్‌ను నిర్ణయిస్తూ అవసరం లేకుండానే అధిక లోడ్‌ను వారిపై మోపుతున్నది. వెంచర్లు, లేఔట్లు, హైరైజ్ బిల్డింగ్‌లు నిర్మించేటప్పుడు తమకు జాగా ఇవ్వాలని కండిషన్ పెట్టినట్టు తెలిసింది. వాస్తవానికి వినియోగదారుడు కోరినంత లోడ్ మంజూరు చేసి సర్వీస్ రిలీజ్ చేయాలి. ఆర్ఎండీ ప్రకారం సదరు సర్వీసులో వాడుతున్న లోడ్ అనుమతి తీసుకున్న దానికంటే ఎక్కువ ఉంటే ఆ ప్రాంత విద్యుత్తు అధికారి తనిఖీ చేసి ఇంటిలో వాడుతున్న విద్యుత్తు పరికరాల ప్రకారం లోడ్ లెక్కించి, ఎక్కువ లోడ్ కోసం డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలని నోటీసులు జారీచేయాలి. నెల రోజుల అనంతరం వినియోగదారుడు వాడుతున్న లోడ్‌ను బట్టి నిర్ణయం తీసుకోవాలి. కానీ డిస్కం జారీచేసిన ఉత్వర్వుల్లో మాత్రం సింగిల్ బెడ్రూంకు రెండు కిలోవాట్లు, డబుల్ బెడ్రూంకు 5 కిలోవాట్లు, ట్రిపుల్ బెడ్రూమ్‌కు 10 కిలోవాట్లు, నాలుగు బెడ్రూంల ఇంటికి 15 కిలోవాట్ల చొప్పున లోడ్ నిర్ణయించారు. ట్రాన్స్‌ఫార్మర్ తీసుకున్న వినియోగదారుడు 11కేవీ లైన్ ఎంత దూరం ఉంటే అంత మేరకు అండర్‌గ్రౌండ్ కేబుల్ ఎస్టిమేషన్‌తో ఇవ్వాలని టీజీఎస్‌పీడీసీఎల్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక వినియోగదారుడు కొత్త కనెక్షన్ తీసుకునే ముందు 11కేవీ లైన్ నాలుగైదువందల మీటర్ల దూరం ఉంటే అక్కడికి అండర్‌గ్రౌండ్ కేబుల్ వేయడానికి ఎస్టిమేషన్ రూపొందించాలి. మధ్యలో వేరే వాళ్ల ప్లాట్లు ఉంటే వాటిలో తవ్వకాలు సాధ్యపడవు. నడిరోడ్డుపై తవ్వుతామంటే జీహెచ్ఎంసీ ఒప్పుకోదు. ఇలా అన్ని రకాల సమస్యలు ఉంటాయి. డిస్కం అధికారులు గత ఇరవై నెలల కాలంలో జారీచేస్తున్న ఉత్తర్వులు, తీసుకుంటున్న నిర్ణయాలు వినియోగదారులపై భారాన్ని మోపుతున్నాయి. ఒకవైపు గదుల వారీగా లోడ్ నిర్ణయిస్తామని చెప్పిన డిస్కం గతంలో 20 కేవీ దాటితే ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలంటూ ఆదేశాలిచ్చింది. అంతేకాకుండా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని మల్టీస్టోర్డ్ బిల్డింగులు, గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, ఓపెన్‌ప్లాట్ లేఔట్లకు లోడ్ ఇవ్వాలంటే సబ్‌స్టేషన్లు నిర్మించాలంటూ డీజీఎస్‌పీడీసీఎల్‌కు 800 నుంచి 1500 చదరపు గజాలు కేటాయించాలని గతంలో మరో ఉత్తర్వులిచ్చింది. ఇవన్నీ ఒక ఎత్తైతే కాంట్రాక్టర్లకు గానీ, విద్యుత్తు సిబ్బందికి గానీ ఇస్తున్న ఉత్తర్వుల్లో చాలావరకు అమలుచేయలేని పరిస్థితి ఉందని, కేబుల్ లేని పరిస్థితుల్లో సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేయలేకపోవడమేనని దీనికి ఉదాహరణగా కాంట్రాక్టర్లు చెప్తున్నారు. అధికారులు జారీచేసిన ఉత్వర్వుల్లో గదుల వారీ లోడ్ పెంచడానికి పేర్కొన్న నిబంధనలు హాస్యాస్పదంగా ఉన్నాయని కాంట్రాక్టర్లు అంటున్నారు. ఇటీవల జరుగుతున్న అగ్ని ప్రమాదాల నేపథ్యంలో గదుల ప్రకారం లోడ్ ఇవ్వాలని నిర్ణయిస్తున్నట్టు ఎస్‌పీడీసీఎల్ జారీచేసిన ఉత్తర్వులో పేర్కొనడం గమనార్హం. ఇటీవల కాలంలో జరిగిన అన్ని అగ్ని ప్రమాదాలకు లోడ్ కంటే అందులో వాడిన పాత కేబుళ్లే కారణమని తేలింది. సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రెవెన్యూ అధికారులతో మాట్లాడి వారి సమన్వయంతో చేయాల్సిన చోట ఇప్పుడు ఈ నిర్ణయం ఏంటంటూ వెంచర్ల నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. దక్షిణ డిస్కం తాను ఒక కొత్త కనెక్షన్ ఇచ్చే సందర్భంలో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌తో పాటు జీహెచ్ఎంసీ పర్మిషన్, ఎన్‌వోసీ, ఓసీ తదితర సర్టిఫికెట్లు చూస్తుంది. కానీ గత ఆరు తరాలకు సంబంధించిన డాక్యుమెంట్లు కావాలని అడిగిన సందర్భం మాత్రం ఒక్క డిస్కంకే చెల్లిందని, సంబంధిత అధికారులు ఏదో ఒక సాకు చూపి కనెక్షన్లు ఇవ్వకుండా సతాయించడానికే ఇలా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అసలు ఆరుతరాల డాక్యుమెంట్స్ వీరికి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

# ఉత్తరాంధ్ర వెలుగులు

**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ విమానాశ్రయానికి ముహూర్తం ఖరారయింది. 2026లోనే ఈ విమానాశ్రయం నుంచి విమానాల రాకపోకలు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖమంత్రిగా ఇదే ప్రాంతానికి చెందిన యువ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఉండటంతో ఇక ఈ పనులు అనుకున్న సమయానికి పూర్తి చేయడానికి అధికారులు రేయింబవళ్లూ కష్టపడుతున్నారు. మంత్రి ఇలాకాలో అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి చేసి వీలయితే ప్రధాని నరేంద్ర మోదీ చేత ప్రారంభించాలన్న ఆలోచనలో ఉన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తవుతున్నాయి. అయితే విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు ప్రత్యామ్నాయంగా ఈ భోగాపురం విమానాశ్రయం రూపుదిద్దుకోవడం, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుగా మారడంతో విమానల సంఖ్య కూడా భారీగా పెరిగే అవకాశముంది. ఇతరదేశాలకు వెళ్లాలంటే ప్రస్తుతం హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరుకు వచ్చివెళ్లాల్సిఉంది.కానీ ఇకపై ఈ విమానాశ్రయం నుంచి రద్దీని బట్టి నేరుగా ఇతరదేశాలకు విమానాలను ప్రయివేటు సంస్థలు నడిపే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయలేరు.దీనివల్లసమయం తగ్గడంతో పాటు ప్రయాణ ఖర్చు కూడా తగ్గుతుందని చెబుతున్నారు. ఇక భోగాపురం విమానాశ్రయం పనులు వేగంగా పూర్తి కావస్తుండటంతో ఆచుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి... అక్కడ భూములు కొనుగోలు చేయలేని పరిస్థితి. అనేక రియల్ ఎస్టేట్ సంస్థలు వెలిశాయి. వెంచర్లు వేయడంతో చకచక అమ్ముడుపోయాయి. దీంతో పాటు భోగాపురం విమానాశ్రయం రాకతో చుట్టు పక్కల ప్రాంతాలు కూడా అంతే వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఏపీ స్కూబా డైవింగ్ సంస్థకు చింతపల్లి తీరంలో టూరిజం కాటేజీలను కేటాయించారు. ఈ మేరకు కాటేజీల పునర్నిర్మాణం జరుగుతోంది.నాలుగున్నర ఎకరాల్లో దీనిని చేపట్టారు. ఏపీ ప్రభుత్వం పర్యాటక శాఖకు 80 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ 80 ఎకరాల భూమిలో.. ఒబెరాయ్ సంస్థకు 40 ఎకరాలు.. మై కేర్ సంస్థకు 40 ఎకరాలు చొప్పున ఇచ్చారు. వీటికి తోడుగా ఫైవ్ స్టార్ హోటల్స్ కూడా రానున్నాయి. భోగాపురం, భీమిలి మండలాల్లో ఏర్పాటు అవుతున్నాయి. జీఎంఆర్ సంస్థ 500 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్ట్‌ను ఆనుకుని ఫైవ్ స్టార్ హోటల్ నిర్మించనుంది.వంద కోట్ల రూపాయలతో ఓ ప్రైవేట్ బీచ్ ఫ్రంట్ రిసార్ట్ నిర్మాణం కూడా మొదలైంది. దాదాపుగా రూ.150 కోట్లతో ఎయిర్‌పోర్ట్ దగ్గర కన్వెన్షన్ సెంటర్ కూడా ఏర్పాటు కానుంది. ఇప్పటికే తాజ్ హోటల్‌ను భీమిలి మండలంలో నిర్మించాలని నిర్ణయించడంతో ఇక ఇక్కడ అభివద్ధిని ఆపడంఎవరి తరమూ కాదు. భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఒకవైపు 16వ జాతీయ రహదారి ఉండటం, మరోవైపు అందమైన,

అందర్నీ ఆకట్టుకునే సముద్రతీరం కూడా ఉండటంతో అదనపు ఆకర్షణగా మారనుంది. వీఎంఆర్‌డీఏతో పాటు ప్రభుత్వ శాఖలు ప్రయాణికులు సులువుగా చేరుకోవడానికి వీలుగా పదిహేను లింక్ రోడ్లు కూడా నిర్మించనున్నారు. విశాఖపట్నం తీర రోడ్డును కూడా ఆరు వరుసలుగా విస్తరించాలని భావిస్తున్నారు. దీంతో పాటు భోగాపురం విమానాశ్రయం దగ్గర వంద ఎకరాల్లో ఐటీ కంపెనీ ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది ప్రభుత్వం. భోగాపురంతో పాటుగా ఆనందపురం, భీమిలి, పూసపాటిరేగ, తగరపువలస వంటి ప్రాంతాల్లో టౌన్‌షిప్‌ల నిర్మాణానికి రియల్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందడనడంలో అతిశయోక్తి లేదు.


# ఫ్లోటింగ్ బోట్... డబుల్ డెక్కర్..!

## పర్యాటకుల కోసం ప్రత్యేకంగా..




**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** రాజకీయాల్లో ప్రభుత్వాల పని తీరుపై రకరకాలుగా చర్చ నడుస్తుంటుంది. పాలకుల తీరు, విధానాలపై కూడా ప్రజలు చర్చించుకుంటారు. నేతల సమర్థతపై మాట్లాడుతుంటారు. ఇప్పుడు ఏపీలో అటువంటి చర్చ ఒకటి నడుస్తోంది. విశాఖలో పర్యాటకుల కోసం డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేసింది ఏపీ పర్యాటక శాఖ. ఈరోజే ఆ బస్సులను ప్రారంభించారు ఏపీ సీఎం చంద్రబాబు. విశాఖ నగరంలో పర్యాటకుల కోసం ప్రత్యేకంగా తిరిగే ఈ డబుల్ డెక్కర్ బస్సుల్లో.. 24 గంటల ప్రయాణానికి కేవలం 250 రూపాయల టికెట్ నిర్ధారించారు. అయితే రోజంతా ఈ డబుల్ డెక్కర్ లో ప్రయాణానికి తొలుత 500 రూపాయలుగా పర్యాటకశాఖ టికెట్ ధరగా నిర్ణయించింది. కానీ చంద్రబాబు ప్రారంభోత్సవం చేసిన అనంతరం.. దానిని సగానికి తగ్గించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. మిగతా 250 రూపాయల టికెట్ ధరను ప్రభుత్వ భరిస్తుందని.. పర్యాటకులకు రాయితీ కింద అందిస్తామని ప్రకటన చేశారు. ఇదే సమయంలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పర్యాటక విధానం ఒకటి ఎక్కువమంది గుర్తు చేస్తున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో విశాఖ బీచ్ లో పర్యాటక అభివృద్ధికి సంబంధించిన ఏర్పాట్లు జరిగాయి. ఆర్కే బీచ్ లో సుమారు నాలుగు కోట్ల రూపాయల ఖర్చుతో.. సముద్రపు అలలపై తెలియాడే చిన్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయించారు. అది తీరం నుంచి సుమారు 100 నుంచి 200 అడుగుల సముద్రంలో నీళ్లపై తెలియాడుతూ ఉంటుంది. అయితే అది మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలింది. ఏర్పాటు చేసిన రెండు రోజులకే ముక్కలు ముక్కలుగా మారింది. వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాన్ని బయటపెట్టింది. కేరళ తీరంలో ఉండే ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ను ఏపీకి పరిచయం చేశారు జగన్. కానీ కేరళలో అలల తాకిడి తక్కువగా ఉంటుంది. అక్కడైతే సరిపోతుంది కానీ విశాఖలో.. అలలు ప్రమాదకరంగా ఉంటాయి. ఓవైపు ఇక్కడి అలలు ప్రమాదకరం అని బోర్డులు ఉండగా.. దాని చెంతనే ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జి అప్పట్లో ఏర్పాటు చేయడం కూడా విమర్శలకు తావిచ్చింది. అప్పట్లో ఫ్లోటింగ్ బ్రిడ్జికి ప్రభుత్వం కేటాయించిన నిధులు నీటి పాలయ్యాయి.తాజాగా విశాఖలో పర్యాటక ప్రాంతాలన్నీ కలుపుతూ ఈ డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేసింది ఏపీ ప్రభుత్వం. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు వ్యాపించి ఉంది. దారి పొడవునా ఎన్నెన్నో బీచ్ పార్కులు, వ్యూ పాయింట్స్ ఎన్నో ఉన్నాయి. వాటన్నింటినీ సందర్శించడానికి వీలుగా సీఎం చంద్రబాబు సూచనల మేరకు పర్యాటకశాఖ డబుల్ డెక్కర్ బస్సులను ఏర్పాటు చేసింది. వీటికి వచ్చే ఆదరణబట్టి మరిన్ని బస్సులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. విశాఖ ప్రజలతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు.. ఈ డబ్బులు డెక్కర్ బస్సుల్లో బీచ్ పార్కులు చూసేందుకు అవకాశం కలుగుతుంది. జగన్ నాలుగు కోట్ల రూపాయలతో ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటు చేయగా.. రెండు రోజులకే ముక్కలయింది. కానీ చంద్రబాబు అదే నాలుగు కోట్ల రూపాయలతో రెండు డబుల్ డెక్కర్ బస్సులను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. తొలి రోజే దీనికి విశేష ఆదరణ లభించింది. అందుకే ఇప్పుడు జగన్ విధానం వర్సెస్ చంద్రబాబు విధానం అన్నట్టు పోటీ నడుస్తోంది. తప్పకుండా డబ్బులు డెక్కర్ వైపే అందరూ మొగ్గు చూపుతారు కూడా. ఎందుకంటే ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేసిన రెండు రోజులకే అది ముక్కలైంది కనుక..విశాఖను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ఇప్పటికే అక్కడ పర్యాటక స్థలాలు ఎన్నో ఉన్నాయి. పెద్ద ఎత్తున విశాఖకు పర్యాటకులు వస్తుంటారు. దీంతో వారికి మరింతగా సౌలభ్యత కల్పించేందుకు ఏపీ ప్రభుత్వం నడుం బిగించింది. డబుల్ డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చింది. హాప్ ఆన్ హాప్ ఆఫ్ బస్సుల పేరిట రెండు డబుల్ డెక్కర్ బస్సులు ఏర్పాటు చేయగా.. వాటిని ఈరోజు సీఎం చంద్రబాబు ప్రారంభించారు. అనంతరం ప్రజాప్రతినిధులతో కలిసి ఆ బస్సులోనే ప్రయాణించారు. ఆర్కే బీచ్ నుంచి తొట్లకొండ వరకు 16 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాల్లో ఈ ప్రత్యేక బస్సులు తిరుగుతాయి. ప్రారంభోత్సవం సందర్భంగా ఈ ఎలక్ట్రికల్ డబుల్ డెక్కర్ బస్సుల్లో స్వయంగా సీఎం చంద్రబాబు కొంత దూరం ప్రయాణించారు. ప్రత్యేకంగా పర్యాటకుల కోసమే ఈ డబ్బులు డెక్కర్ బస్సులను అందుబాటులోకి తెచ్చారు. 24 గంటలపాటు ఒకే టికెట్టు ప్రయాణించే సౌలభ్యత కల్పించారు టికెట్ చార్జీ 500 రూపాయలుగా నిర్ణయించారు. అయితే అందులో సగం మొత్తాన్ని ప్రభుత్వమే భరించనుంది. కేవలం 250 రూపాయలకే 24 గంటలపాటు ఈ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేయవచ్చు అన్నమాట. నిజంగా ఇది పర్యాటకులకు ఒక వరమే. ఇప్పటికే పర్యాటక రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రయత్నిస్తోంది కూటమి ప్రభుత్వం.

# ప్రతి పదివేల మందికి ఒక టాయ్ లెట్...!







**హైదరాబాద్,తెలంగాణ దిశ :**పబ్లిక్ టాయిలెట్లు సరిగా లేక హైదరాబాద్‌లో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు 10 వేల మందికి ఒక టాయిలెట్ మాత్రమే అందుబాటులో ఉంది. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. గతంలో ప్రారంభించిన అనేక టాయిలెట్లు దయనీయ స్థితిలో ఉన్నాయి. చెత్త పేరుకుపోయి, తలుపులు విరిగి, పనిరాకుండా పడి ఉన్నాయి. సులభ్ కాంప్లెక్సుల నిర్వహణపై కొంత సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నార్వే, టర్కీ, జపాన్ వంటి దేశాలు టాయిలెట్ల నిర్వహణ ఎందుకు మెరుగ్గా ఉందిపని మీద బయటకు వెళ్లిన సమయంలో కడుపు ఉబ్బి ఇబ్బంది పడ్డారా? కాంక్రీటు జంగల్‌లో మూత్రం పోయడానికి సరైన టాయిలెట్లు లేకపోవడం వల్ల ఇబ్బందికి గురయ్యారా?.. అయితే ఈ సమస్య ఎదుర్కొన్నది మీరొక్కరే కాదు. దేశవ్యాప్తంగా హైదరాబాద్ లాంటి మహానగరాలు, పట్టణాల్లో ఉన్న అనేక మంది ఇలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా భాగ్యనగరంలో 1.2 కోట్ల మందికి 1,385 పనిచేసే టాయిలెట్లు మాత్రమే ఉండటం పరిస్థితికి అద్దం పడుతోంది. ప్రభుత్వం ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. ఫలితాలు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో వందల, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఫలితం ఎందుకు రావడం లేదు? ఇలాంటి మౌలిక సదుపాయాల కల్పనలో మేటిగా ఉన్న నార్వే, టర్కీ, జపాన్ లాంటి దేశాల నుంచి మనం ఏం నేర్చుకోవాలి అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.హైదరాబాద్‌లో 2025 ఫిబ్రవరి నాటికి 1,386 పబ్లిక్ టాయిలెట్లు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఈ లెక్కన పది వేల మందికి ఒక టాయిలెట్ ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కానీ అంచనాల ప్రకారం నగరంలో 9000లకు పైగా శౌచాలయాలు ఉండాలి. 2018లో జీహెచ్ఎంసీ 7,500 టాయిలెట్లను నిర్వహించేది. ఇప్పుడు దాదాపు 80 శాతం.. నిర్లక్ష్యం, నిర్వహణ లేకపోవడం వల్ల మరుగున పడ్డాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. హైదరాబాద్‌ను బహిరంగ మలవిసర్జన రహితంగా ఇప్పటికే ప్రకటించడం. మరి భాగ్యనగరం ఓపెన్ డెఫికేషన్ ఫ్రీగా ఉందా?నార్వేతో పాటు స్వీడన్, డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఐస్‌లాండ్.. యురోపియన్ దేశాల్లో టాయిలెట్లను 'పబ్లిక్ డిగ్నిటీ'గా భావిస్తారు. స్వీడన్‌లో ఉన్న టాయిలెట్లు వాటి ప్రత్యేక డిజైన్‌లు, శుభ్రతకు ప్రసిద్ధి. స్టాక్‌హోమ్ వంటి నగరాల్లో సెల్ఫ్‌క్లీన్ పబ్లిక్ టాయిలెట్లు ఉంటాయి. ఒకరు వాడిన తర్వాత.. వాటికవే ఫ్లష్ చేసుకుంటాయి. డిస్ఇన్ఫెక్ట్ చేసుకుని.. తర్వాత ఉపయోగించే వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసుకుంటాయి.ఫిన్‌లాండ్ రాజధాని హెల్సింకిలో టాయిలెట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆన్‌లైన్, యాప్స్ ద్వారా తెలుసుకోవచ్చు. రైల్వే స్టేషన్లు, బస్‌స్టాప్ వంటి ట్రాన్స్‌పోర్ట్ హబ్‌ల్లో టాయిలెట్లను క్లీన్గా మెయింటేన్ చేస్తారు. టర్కీలో స్క్వాట్ స్టైల్ (ఇండియన్ స్టైల్) టాయిలెట్లనే ఉపయోగిస్తారు. పబ్లిక్ ప్రాంతాల్లోనూ ఇలాంటివే ఉంటాయి. వాటిని వెస్ట్రన్ టాయిలెట్లతో మార్చకుండా.. అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఫ్లోర్‌ను వాటంతట అదే క్లీన్ చేసుకునేటట్టు ఏర్పాటు చేస్తున్నారు. సిబ్బందిని ఏర్పాటు చేసి.. ఎప్పటికప్పుడు శుభ్రత ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక మెయింటెనెన్స్ కోసం 1-2 లిరా (రూ.5-10 ) తీసుకుంటున్నారు. అందుకు తగ్గట్టే మెయింటేనెన్స్ ఉంటోంది. జపాన్‌లో రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, పబ్లిక్ ప్రాంతాల్లో ఉన్న టాయిలెట్లు.. ఇళ్లలో ఎలా ఉంటాయో అలా శుభ్రంగా ఉంచుతారు. వీటిని సరిగా మెయింటేన్ చేయడం అందరి బాధ్యత అని భావిస్తారు.ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నా.. ఫలితాలివ్వడం లేదు. హైదరాబాద్ లిమిట్స్‌లో ఉన్న పబ్లిక్ టాయిలెట్లలో.. పని చేయకుండా పడి ఉన్న 1370 టాయిలెట్లను పునరుద్ధరించడానికి 2025 జూన్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేసింది జీహెచ్ఎంసీ. దీని ప్రకారం ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్స్, ఆర్‌సీసీ టాయిలెట్లు, ఈ-టాయిలెట్స్, షీ-టాయిలెట్స్, బయో టాయిలెట్స్‌ను అవి ఉన్నచోటునే రీడిజైన్, రీఫర్బిష్ చేస్తారు. బిల్డ్ అండ్ ట్రాన్స్‌ఫర్ మోడ్‌లో ఇలా చేయాలని ఆలోచించాలి. ఈ ప్రతిపాదనలను స్టాండింగ్ కమిటీ అనుమతి కోసం పంపించారు. అయితే జులై నెల చివరలో 525 టాయిలెట్లను పునరుద్ధరిస్తామని అధికారులు చెప్పారు.ప్రస్తుతం హైదరాబాద్‌లోని చాలా టాయిలెట్లు దారుణ పరిస్థితిలో ఉన్నాయి. డోర్లు విరిగిపోవడం, చెత్తతో నిండిపోవడం, నీరు, డ్రైనేజీ సరిగా లేకపోవడం నిరుపయోగంగా పడి ఉన్నాయి. కొన్ని సులభ్ కాంప్లెక్సుల్లో మాత్రమే నిర్వహణ సక్రమంగా ఉంది. పబ్లిక్ టాయిలెట్లు అవసరం రోజురోజుకు పెరుగుతున్నా.. వాటిని సక్రమంగా నిర్వహించడంలో జీహెచ్ఎంసీ ఫెయిల్ అవుతోందనే విమర్శలు వస్తున్నాయి.విదేశాల్లో ఉన్నట్లు.. పట్టణ ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకునే వ్యవస్థ భారత్‌లో ఇప్పటికే ఉంది. గూగుల్ ద్వారా ఈ వివరాలు తెలుసుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మంత్రిత్వ శాఖ గూగుల్‌తో ఒప్పందం చేసుకుంది. స్వచ్ఛ్ భారత్ మిషన్) టాయిలెట్ అంటే సెర్చ్ చేస్తే.. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో చూపిస్తుంది. వీటి నిర్వహణ గురించి కంప్లైంట్ చేయాలంటే జీహెచ్ఎంసీ యాప్, లేదా స్వచ్ఛత యాప్‌లోకి వెళ్లాలి. దీంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒక యాప్ లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లో అన్ని రకాల పబ్లిక్ టాయిలెట్ల గురించి వివరాలు ఉండాలని, ఫిర్యాదు చేసే వ్యవస్థకు కూడా ఉండాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.మరోవైపు, వెబ్‌సైట్‌లో సరైన వివరాలు రావడం లేదు. సులభ్, పీఎఫ్‌టీ టాయిలెట్స్, సులభ్ కాంప్లెక్స్ అంటూ ఏ టాయిలెట్ రకం సెలెక్ట్ చేసుకున్నా.. ఒకే రకమైన సమాచారం వస్తోంది. ఇలా.. రూ. వందల కోట్లలో నిధులు ఖర్చు చేస్తున్నా, టెక్నాలజీ అందుబాటులో ఉన్నా హైదరాబాద్ లాంటి నగరాల్లో పబ్లిక్ టాయిలెట్ల పరిస్థితి మెరుగుపడటం లేదు. ప్రభుత్వాలు కేటాయించే నిధులు కాంట్రాక్టర్లు పక్కదారి పట్టించకుండా ఉంటే.. పైన చెప్పుకున్న దేశాల్లోలాగా పబ్లిక్ టాయిలెట్లను శుభ్రంగా ఉంచుకునే ప్రయత్నం చేయగలం.ఇప్పటికే ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకుంటున్నా.. నిర్వహణను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే.. గతంలో అట్టహాసంగా ప్రారంభించిన పబ్లిక్ టాయిలెట్లు ప్రస్తుతం ఎలా ఉన్నాయో మనం చూస్తునే ఉన్నాయి. ఇలా జరగాలంటే ప్రజల పన్నులకు ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండాలి. నియమ నిబంధనలు ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. పౌరులు కూడా ప్రజా ఆస్తుల పట్ల సామాజిక బాధ్యతతో ప్రవర్తించాలి. పరిశుభ్రత ప్రజా ఉద్యమంగా మారే వరకు.. కడుపు ఖాళీ చేసేందుకు అవస్థలు పడాల్సిందే!




# ప్రగతి-శీల బాట

ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష ఐక్య కూటమి ప్యానెల్ విజయదుందుభి మోగించడం ప్రస్తుతం ఆధిపత్యం చెలాయించేందుకు దారులు వెతుకుతున్న విద్వేష, విభజన రాజకీయాలకు ప్రతిఘటన. వివిధ సాకులతో లెఫ్ట్ ఐక్యతను కించపరిచే ప్రయత్నాలు అడుగడుగునా సాగినప్పటికీ, ఈ స్పష్టమైన తీర్పు మూడు విద్యార్థి సంస్థల కూటమి రూపొందించిన లౌకిక, ప్రజాస్వామ్య సూత్రప్రాయమైన విధానం ఔచిత్యాన్ని నొక్కి చెప్పింది. జెఎన్‌యుఎస్‌యు నాలుగు ప్రధాన ప్యానెల్ పదవులకు, 42 కౌన్సిలర్ పోస్టులకు మంగళవారం ఓటింగ్ జరగ్గా 67 శాతం పోలింగ్ నమోదైంది. ఆ రోజు సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగగా గురువారం సాయంత్రానికి తుది ఫలితాలొచ్చాయి. అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి.. నాలుగు ప్రధాన ప్యానెల్ పదవులను లెఫ్ట్ యూనిటీ భారీ మెజార్టీలతో కైవసం చేసుకొని క్లీన్‌స్వీప్ చేసింది. పలు కౌన్సిలర్ పదవులను సైతం లెఫ్ట్ యూనిటీ గెలిచింది.

గత ఎన్నికల్లో సహాయ కార్యదర్శి పదవి ఒక్కటీ నానాగడ్డికరిచి దక్కించుకున్న బిజెపి అనుబంధ సంఘం ఎబివిపి, ఈ సారి ఆ స్థానాన్ని సైతం కోల్పోయి మొత్తానికే తుడిచిపెట్టుకుపోయింది. జెఎన్‌యును తన విద్వేష రాజకీయాలకు కేంద్రంగా మార్చుకొనేందుకు కుట్రలు పన్నుతున్న బిజెపికి ఈ ఎన్నికల ఫలితాలు పెద్ద షాక్.

అటు కేంద్రంలో ఇటు ఢిల్లీ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాల అండదండలు, ఆర్‌ఎస్‌ఎస్, విద్వేష కుతంత్రాలు పుష్కలంగా కలిగిన ఎబివిపి పై వామపక్ష విద్యార్థి సంఘాలు ఎస్‌ఎఫ్‌ఐ, ఎఐఎస్‌ఎ, డిఎస్‌ఎఫ్‌లు జెఎన్‌యుఎస్‌యు ఎన్నికల్లో వీరోచితంగా పోరాడి మట్టికరిపించడం మామూలు విషయం కాదు. జెఎన్‌యు ఎన్నికలంటే యావత్ దేశానికి, ముఖ్యంగా విద్యార్థులకు, యువతకు అమితమైన ఆసక్తి. జెఎన్‌యులో ఆలోచనలు సంఘర్షిస్తాయి. అభివృద్ధి నిరోధక, ప్రగతిశీల శక్తుల మెదళ్లు ఘర్షిస్తాయి. జాతీయ, అంతర్జాతీయ పరిణామాలపై నిరంతరం తూలనాత్మక చర్చలు చేసే వేదిక జెఎన్‌యు. ప్రజాస్వామ్యానికి, మానవ హక్కులకు ఎక్కడ ముప్పు వాటిల్లినా ప్రశ్నించి నిరసించి గళమెత్తే గొంతుక. అభివృద్ధి నిరోధకులపై ఉక్కు పిడికిలి. నిరంకుశత్వానికి, మతోన్మాదానికి, కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలకు జై కొట్టే ఆర్‌ఎస్‌ఎస్‌కు, బిజెపికి జెఎన్‌యు ఆ విధంగా వైవిధ్యంగా విలక్షణతతో ఉండటం ఎంత మాత్రం ఇష్టం లేదు. తన సహజసిద్ధ ఏకరూప సిద్ధాంతంతో యూనివర్శిటీలో వైషమ్యాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకున్నాయి. జెఎన్‌యు ఎన్నికల్లో ఎబివిపిని గెలిపించేందుకు, లెఫ్ట్ కూటమిని ఓడించేందుకు యూనివర్శిటీ పాలకవర్గం చేసిన ప్రయత్నాలు ఎన్నో కనిపిస్తాయి. పాలస్తీనాపై అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ చేస్తున్న వికృత యుద్ధోన్మాదాన్ని జెఎన్‌యు విద్యార్థులు నిరసించడం బిజెపికి, ఆర్‌ఎస్‌ఎస్‌కు కంటగింపు. అమెరికా మార్గదర్శకత్వంలో నాటో కూటమి ఉక్రెయిన్‌కు సహకరించి రష్యాపైకి దండెత్తడం తప్పని జెఎన్‌యు విద్యార్థులు ఖండిస్తే బిజెపి, సంఘ్ తట్టుకోలేవు. సిఎఎను నిరసించినా, 370 ఆర్టికల్ రద్దుపై నిలదీసినా, మతతత్వ శక్తుల పాశవిక దాడులపై గొంతెత్తినా, ప్రభుత్వ విద్యార్థి వ్యతిరేక విధానాలపై పోరాడినా, చివరికి యూనివర్శిటీలో సమస్యలపై ఆందోళనలు చేసినా నేతల అక్రమ అరెస్టులు, పోలీస్ బల ప్రయోగాలు, కఠినమైన కేసులు నిత్యకృత్యమయ్యాయి.

బిజెపి సర్కారు ఒక వైపు నూతన విద్యా విధానం పేరిట విద్యను కార్పొరేటీకరిస్తూ, మరో వైపు యూనిర్శిటీ పరిపాలనలో సంఘ్ పరివార్ అనుకూలురను చొప్పించి హిందూ జాతీయ ప్రాజెక్టు అమలుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

ఈ రాజకీయాలను, విధానా లను వ్యతిరేకిస్తూ ఇటీవలి కాలంలో విద్యాసంస్థల ఎన్నికల్లో వామపక్ష, ప్రగతిశీల శక్తులు గెలుపొందుతున్నాయి. తాజాగా జెఎన్‌యు, పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్శిటీ మొదటి దశ ఎన్నికల్లో ఎస్‌ఎఫ్‌ఐ విజయభేరి మోగించింది.

మొత్తం117 కౌన్సిలర్ స్థానాలకు గాను 68 చోట్ల ఎస్‌ఎఫ్‌ఐ గెలిచింది. రెండవ దశ ఎన్నికల్లో ప్రధాన ప్యానెల్ పోస్టులనూ ఎస్‌ఎఫ్‌ఐ కైవసం చేసుకుంటుందని ఆశించవచ్చు. బిజెపి, సంఘ పరివార్ మతతత్వ, విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రగతిశీల, ప్రజాస్వామ్య ఉద్యమాలు అనివార్యమైనవి.



# వేలాది నాటుకోళ్లు ఫ్రీగా దొరికితే ఎలా ఉంటుంది?

**హన్మకొండలో ఇదే జరిగింది.. ఎగబడిన జనం!**
**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో వింత ఘటన**
**రహదారిపై 2000కు పైగా నాటుకోళ్లు ప్రత్యక్షం**
**గుర్తు తెలియని వ్యక్తులు వదిలివెళ్లినట్లు నిర్ధారణ**
**సమీప పొలాల్లోకి వెళ్లడంతో గమనించిన రైతులు**
**పండగ చేసుకుంటున్న గ్రామస్థులు**

**హనుమకొండ,తెలంగాణ దిశ :** మార్కెట్లో నాటుకోడి మాంసానికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దాని ధర కూడా మటన్‌తో పోటీ పడుతుం టుంది. అలాంటిది వేల సంఖ్యలో నాటుకోళు ఉచితంగా దొరికితే ఎలా ఉంటుంది? సరిగ్గా ఇలాంటి వింత ఘటనే హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏకంగా 2000కు పైగా నాటుకోళ్లు రోడ్డుపై ప్రత్యక్షమవడం స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. ఎల్కతుర్తి నుంచి సిద్దిపేట వెళ్లే ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 2000కు పైగా నాటుకోళ్లను వదిలి వెళ్లిపోయారు. రద్దీగా ఉండే రోడ్డుపై ఉన్న ఆ కోళ్లన్నీ సమీపంలోని పంట పొలాల్లోకి వెళ్లాయి. పొలాల్లో వేలాది కోళ్లు గుంపులుగా తిరుగుతుండటాన్ని గమనించిన రైతులు ఆశ్చర్యపోయారు. మొదట అవి ఎక్కడి నుంచి వచ్చాయో అర్థంకాక ఆరా తీయగా, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలి వెళ్లినట్లు నిర్ధారించుకున్నారు. ఇక ఈ విషయం తెలియడంతో రైతులు వాటిని పట్టుకోవడం మొదలుపెట్టారు. ఈ వార్త క్షణాల్లో ఊరంతా పాకింది. దీంతో ఎల్కతుర్తి గ్రామస్థులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని కోళ్లను పట్టుకునేందుకు పోటీ పడ్డారు. ఒక్కొక్కరూ తమకు దొరికినన్ని కోళ్లను పట్టుకుని ఇళ్లకు తీసుకెళ్లారు. కొందరైతే రెండు, మూడు కోళ్లను పట్టుకుని సంతోషంగా వెనుదిరిగారు. దీంతో ఆ ప్రాంతమంతా కోళ్లను వేటాడే వారితో సందడిగా మారింది.

# లూలూ గ్రూప్ పై ప్రేమ ఎందుకో...

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లూలూ గ్రూప్‌కు విశాఖపట్నం, విజయవాడలో ప్రధాన భూములు లీజ్‌పై అలాట్ చేయడం వెనుక భారీ సబ్సిడీలు, రివర్షన్ క్లాజ్‌లు లేకుండా లీజ్‌లు ఇవ్వడం వంటి నిర్ణయాలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇటీవలే అహ్మదాబాద్‌లో 519 కోట్ల రూపాయలకు 16 ఎకరాలు కొన్న లూలూ ఇంటర్నేషనల్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఏపీలో మాత్రం ప్రభుత్వ భూములను 'సబ్సిడీ' రూపంలో తక్కువ రేట్‌లో తీసుకుంటూ, విలువైన ఆస్తులను కార్పొరేట్ లాభాలకు మార్చుకుంటోంది. అహ్మదాబాద్‌లోని చంద్‌ఖేడా ప్రాంతంలో లూలూ గ్రూప్ 16.35 ఎకరాల ప్రధాన భూమిని 519.41 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసింది. ఈ డీల్ అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో జరిగింది, ఇక్కడ లూలూ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ మార్కెట్ రేట్‌లో పూర్తి చెల్లింపు చేసి, రికార్డు స్థాయి 31.16 కోట్ల రూపాయల స్టాంప్ డ్యూటీ చెల్లించింది. ఈ భూమిపై మెగా మాల్ నిర్మాణం ప్రణాళికలో ఉంది, ఇది గుజరాత్‌లోని రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఊపునిస్తోంది. ఈ డీల్ ఏపీలో జరుగుతున్న అలాట్‌మెంట్‌లతో పోల్చితే పూర్తి భిన్నంగా ఉంది. అహ్మదాబాద్‌లో ప్రభుత్వ సబ్సిడీలు లేకుండా, పూర్తి మార్కెట్ విలువతో కొనుగోలు చేసిన లూలూ, ఏపీలో మాత్రం ప్రభుత్వ భూములను తక్కువ రేట్‌లో లీజ్‌పై తీసుకుని, "సబ్సిడీ"లా మార్చుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2025 జులైలో జారీ చేసిన ఊూ 137 ,,,, ఊూ 45 ప్రకారం, విశాఖపట్నంలో 13.74 ఎకరాలు, విజయవాడలో 4.15 ఎకరాలు ఆర్టీసీ భూములను లూలూ గ్రూప్‌కు లీజ్‌పై అలాట్ చేసింది. విశాఖలో భూములు హార్బర్ పార్క్ సమీపంలో, బీచ్ వద్ద ఉన్న ప్రధాన ప్రదేశాల్లో ఉన్నాయి. విలువ సుమారు 2,000 కోట్ల రూపాయలు ఉంటుంది. ఆంధ్రా టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ 2024-29 ప్రకారం, 65 సంవత్సరాల లీజ్ (మరో 33 సంవత్సరాలు పొడిగించుకోవచ్చు) ఇచ్చారు, కానీ రివర్షన్ క్లాజ్ (ప్రాజెక్ట్ ఫెయిల్ అయితే భూమి తిరిగి ప్రభుత్వానికి) లేకపోవడం, తక్కువ రేట్ లో ఇవ్వడం వంటి అంశాలు వివాదానికి కారణమయ్యాయి. విజయవాడలో మాల్ ప్రాజెక్టుకు 1,222 కోట్ల పెట్టుబడి ప్రకటించినప్పటికీ, భూమి అలాట్‌మెంట్‌లో పారదర్శకత లేకపోవడం వల్ల ప్రజలు, రైతు సంఘాలు నిరసనలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు 10,000 ఉద్యోగాలు సృష్టిస్తాయని ప్రభుత్వం చెప్పినా ఆ ఉద్యోగాలు ఎవరికిస్తారన్నదానిపైనా విమర్శలు ఉన్నాయి. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు ఈ ల్యాండ్ అలాట్‌మెంట్ ను వ్యతిరేకిస్తున్నాయి. విజయవాడ భూమిని ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్లు ఉూ 137ను వ్యతిరేకిస్తూ, భూములు మాల్‌లకు మార్చడం వల్ల పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ బలహీనపడుతుందని హెచ్చరించాయి. సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్లు విజగ్‌లో 14 ఎకరాల ప్రైమ్ ల్యాండ్‌ను ఉచితంగా ఇవ్వడాన్ని "ప్రభుత్వ అనైతికత"గా అభివర్ణించాయి. "లూలూ ప్రాజెక్టులు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బూస్ట్ ఇస్తాయి" అని ప్రభుత్వం వాదిస్తోంది. అహ్మదాబాద్‌లో మార్కెట్ రేట్‌లో పెట్టుబడి చేసిన లూలూ, ఏపీలో సబ్సిడీలతో భూములు తీసుకోవడం వల్ల "డబుల్ స్టాండర్డ్" ఆరోపణలు ఎదుర్కొంటోంది. వైసీపీ, సీపీఎలులు రద్దు డిమాండ్ చేస్తుంటే,టీడీపీ ప్రభుత్వం "ఉద్యోగాలు, పెట్టుబడి"ని హైలైట్ చేస్తోంది. పరిశ్రమలకు అంటే సరే..కానీ మాల్స్ కు కూడా భూమిని ఎందుకు సబ్సిడీకి ఇవ్వాలన్న ప్రశ్నలు వస్తున్నాయి. ఇప్పుడు బడా కంపెనీలు విశాఖకు వస్తున్నందున.. ఆ భూమిని వేలం వేస్తే.. కంపెనీలు కొనుగోలు చేసి పెద్ద మాల్స్ నిర్మిస్తాయని అంటున్నారు. ప్రభుత్వం ఇలాంటి వాటికి సమాధానం చెప్పకపోతే.. లూలుతో కుమ్మక్కయ్యారని ప్రజలు అనుకునే అవకాశం ఉంది.

# అంతర్జాతీయ ఈవెంట్లతో మెరిసిపోనున్న విశాఖ



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ ఇప్పుడు అంతర్జాతీయ ఈవెంట్లకు వేదికగా మారుతోంది. విశాఖ నగరం పలు కీలక అంశాలకు వేదికగా నిలుస్తోంది. అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న పలు వేడుకలకు ఆతిథ్యం ఇవ్వబోతోంది. దేశ విదేశాల నుంచి అంతర్జాతీయ ప్రముఖులు విశాఖ వస్తున్నారు. అందుకే నిఘా పెంచారు. పటిష్టమైన భద్రత వ్యవస్థను నెలకొల్పుతున్నారు. అదే సమయంలో వచ్చే అతిథులు మంత్రముగ్ధులయ్యేలా నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సిటీ బ్యూటీఫికేషన్ తో పాటుగా సరికొత్తగా నగరంలోని ప్రముఖ కూడళ్లను తీర్చిదిద్దుతు న్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ విభాగాలన్నీ పూర్తి స్థాయిలో పనులు చేయిస్తున్నాయి. నవంబర్ 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా కవన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో పెట్టుబడుదారుల సదస్సు జరగబోతోంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సమ్మిట్ ను నిర్వహిస్తోంది. ఆంధ్రాయూనివర్శిటీ ఇంజనీరింగ్ గ్రౌండ్ లో జరగనున్న ఈ సదస్సు దేశంలోని ప్రముఖ వ్యాపార వేత్తలతో పాటుగా అంతర్జాతీయ స్థాయి వ్యాపార దిగ్గజాలు, వాణిజ్య సంస్థలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యే అవకాశం ఉంది. దాదాపుగా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడుల సమీకరణ లక్ష్యంగా సమ్మిట్ నిర్వహిస్తుండటంతో విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు, నగర సుందరీకరణ పనలు చేపడుతున్నారు. నారా లోకేష్ స్వయంగా ఏర్పాట్లను చూసుకుంటున్నారు. భారత నావికాదళానికి అత్యంత కీలకమైన విశాఖ కేంద్రంగా ఉన్న తూర్పు నావికాదళం దేశ రక్షణకు సంబంధించిన ప్రతిష్టాత్మక వేడుకలను విశాఖలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2026 ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ ఆర్) జరగనుంది. పలు ప్రపంచ దేశాలకు చెందిన నావికాదళాలు ఈ వేడుకలకు హాజరై తమ నౌకాదళ అస్త్రాలు, ఆయుధ సంపత్తి శక్తి సామర్థ్యాలను ప్రదర్శించబోతున్నాయి. ఈ కార్యక్రమానికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా హాజరుకానున్నారు. అలాగే మన నౌకాదళానికి చెందిన ఐఎన్ ఎస్ విక్రాంత్ జలాంతర్గామి నుంచి ఆయుధ సంపత్తిని రాష్ట్రపతి పరిశీలిస్తారు. మిలాన్ పేరిట నౌకాదళానికి చెందిన మరో కీలక వేడుకకు కూడా విశాఖ ఆతిథ్యం ఇవ్వబోతోంది. పలు దేశాలకు చెందిన నౌకాదళాలు, కోస్టు గార్డులు మిలాన్ వేడుకలకు హాజరుకానున్నాయి. సాగర తీరంలో తమ విన్యాసాలను ఈ మిలాన్ లో భాగంగా ప్రదర్శించబోతున్నాయి. సిటీ పరేడ్ అత్యంత ఆకర్షణగా నిలబోతోంది. అలాగే భారత నావికాదళం ఆధ్వర్యంలో పలు దేశాలకు నేవీ అధిపతులు సదస్సు కూడా జరగనుంది. పలు దేశాల ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపరుచుకోవడం, పరస్పరం సమాచారం అందిపుచ్చుకోవడం, పకడ్బందీ భద్రతపై చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. ఇలా అంతర్జాతీయంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన సదస్సులకు విశాఖ వేదిక కావడంతో అంతర్జాతీ యంగా పేరు మార్మోగనుంది.

# అబ్కారీ ఆదాయమే 6500 కోట్లు



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు అక్టోబర్ నెల కాసుల వర్షాన్ని కురిపించింది. ఒకవైపు పండగల వేళ.. భారీగా మద్యం విక్రయాలు జరగడంతోపాటు.. మరోవైపు కొత్త మద్యం షాప్‌ల కోసం టెండర్లు పిలవడంతో భారీగా ఆదాయం సమకూరింది. గతంతో పోల్చితే ఈ ఏడాది అక్టోబర్‌లో రాష్ట్ర ఖజానాకు భారీగా డబ్బులు వచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ అక్టోబర్‌లో ఆదాయం రావడం ఎక్సైజ్ శాఖ అధికారులను కూడా ఆశ్చర్యానికి గురి చేస్తోంది.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊపునిస్తూ.. ఎక్సైజ్ శాఖ రికార్డు స్థాయిలో అక్టోబర్ నెలలో ఆదాయాన్ని నమోదు చేసింది. కేవలం ఒకే ఒక్క నెలలో ఏకంగా రూ.6,348 కోట్ల భారీ ఆదాయం ప్రభుత్వ ఖజానాలో జమ అయింది. కొత్త మద్యం పాలసీ అమలు చేయడంతోపాటు.. నెలలో పండుగల సీజన్ కలయికతో ఈ అద్భుత మైన వృద్ధి సాధ్యమైందని అధికారులు తెలిపారు. ఇక ఎక్సైజ్ శాఖకు వచ్చిన ఈ మొత్తం ఆదాయంలో దాదాపు సగం వాటా కొత్త మద్యం పాలసీ మార్పుల ద్వారానే వచ్చిందని సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు.. తెలంగాణలో మొత్తం 2,620 మద్యం దుకాణాలకు 2 ఏళ్ల కాలానికి కొత్త లైసెన్సులు ఇచ్చే ప్రక్రియలో భాగంగా దరఖాస్తులను ఆహ్వానించగా.. భారీగా స్పందన లభించింది.గతంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఒక్కో షాప్ కోసం రూ.2 లక్షల దరఖాస్తు ఫీజు వసూలు చేసేవారు. అయితే ఈ మొత్తాన్ని వెనక్కి ఇచ్చేవారు కాదు. అయితే ఈసారి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దరఖాస్తు ఫీజును రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచింది. ఫీజును భారీగా పెంచినా.. మద్యం దుకాణాల లైసెన్సుల కోసం 95,628 మంది దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. కేవలం మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారానే ఎక్సైజ్ శాఖకు రూ.2,868.8 కోట్ల ఆదాయం సమకూరింది. ఇక లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వ్యాపారులు తొలి విడతలో లైసెన్స్ ఫీజులో ఆరో వంతు మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించగా.. అదనంగా మరో రూ.313 కోట్లు ప్రభుత్వానికి అందాయి. దీంతో లైసెన్సుల ప్రక్రియ ద్వారా వచ్చిన మొత్తం రూ.3,180 కోట్లు అని లెక్క తేలిందిమరోవైపు.. అక్టోబర్ నెలలో బతుకమ్మ, దసరా వంటి వరుస పండుగలు.. జాతరలు ఉండటంతో మద్యం అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. ఇక అక్టోబర్ నెలలో మద్యం అమ్మకాల ద్వారా రూ.3,168 కోట్ల ఆదాయం తెలంగాణ ఎక్సైజ్ శాఖకు సమకూరింది. గతేడాది అక్టోబర్‌లో మద్యం అమ్మకాల ద్వారా రూ.2,987 కోట్లు రాగా.. ఈసారి ఆ రికార్డును అధిగమించడం గమనార్హం.ఈ రెండు ప్రధాన వనరుల నుంచి వచ్చిన రూ.6,348 కోట్ల భారీ ఆదాయంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ అదనపు ఆదాయం కారణంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు త్వరగా మంజూరవుతాయని మద్యం సరఫరాదారులు, కాంట్రాక్టర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రాణాలు కాపాడాల్సిన నర్స్

**నర్స్ పాపానికి పదిమంది పేషెంట్లు ఔట్**

బెర్లిన్: రోగులకు సేవ చేసి వారి ప్రాణాలు కాపాడాల్సిన ఓ నర్స్ దారుణానికి ఒడిగట్టింది. ఏకంగా 10 మంది పేషెంట్లను చంపేసింది. మరో 27 మందిని చంపడానికి ప్రయత్నించింది. చివరకు పాపం పండి జైలు పాలైంది. తాజాగా, నర్సు కేసుపై విచారణ జరిపిన కోర్టు ఆమెను దోషిగా తేల్చింది. జీవిత ఖైదు విధించింది. ఈ సంఘటన జర్మనీలో చోటుచేసుకుంది. ఆ పూర్తి వివరాల్లోకి వెళితే.. జర్మనీలోని ఆచెన్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ స్థానికంగా ఉండే ఆస్పత్రిలో నర్సుగా పని చేసేది.ఆమెకు తరచుగా నైట్ డ్యూటీలు పడుతూ ఉండేవి. ఆస్పత్రిలో పేషెంట్లు ఎక్కువగా ఉండటంతో పని చేయటం ఆమెకు ఇబ్బందిగా అనిపించింది. దీంతో ఓ దారుణమైన నిర్ణయం తీసుకుంది. వృద్ధ పేషెంట్లకు ఇంజెక్షన్లు ఇచ్చి చంపేసింది. 2023 డిసెంబర్ నుంచి మే 2024 మధ్య కాలంలో 10 మంది పేషెంట్లను చంపేసింది. మరో 27 మందిని చంపటానికి ప్రయత్నించి విఫలమైంది. ఆమె నైట్ డ్యూటీలో ఉన్నప్పుడే ఎక్కువ మంది చనిపోతుండటంతో ఆస్పత్రి ఉన్నతాధికారులకు అనుమానం వచ్చి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. ఆమెను అరెస్ట్ చేశారు. అప్పటినుంచి కోర్టు ప్రొసీడింగ్స్ జరుగుతున్నాయి. బుధవారం ఆచెన్ కోర్టు ఈ కేసుపై విచారణ జరిపి తుది తీర్పు వెలువరించింది. ఆమెను దోషిగా తేల్చి, జీవిత ఖైదు విధించింది. దీనిపై కోర్టుకు సంబంధించిన అధికార ప్రతినిధి ఒకరు మాట్లాడుతూ.. ఆమె 15 సంవత్సరాలకే విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ తీర్పుపై పైకోర్టును ఆశ్రయించవచ్చని తెలిపారు.

# వియత్నాంలో బీభత్సం సృష్టించిన తుపాన్

**వేలాదిగా నేలమట్టం అయిన ఇళ్లు**

న్యూఢిల్లీ: ఫిలిప్పీన్స్ దేశాన్ని అతలాకుతలం చేసిన కాల్మేగీ తుపాను వియత్నాంలో కూడా బీభత్సంసృష్టించింది. గియా లాయ్, డాక్ లక్ ప్రావిన్సుల్లో వేల కొద్దీ ఇళ్లు దెబ్బతిన్నాయి. వాటి పైకప్పులు తుపాను గాలులకు కొట్టుకుపోయాయి. మరికొన్ని ఇళ్లు పూర్తిగా నేలమట్టమ య్యాయి. గంటకు దాదాపు 149 కిలోమీటర్ల వేగంతో భయానక గాలులు వీచడంతో ప్రజలు బెంబేలు పడ్డారు. వియత్నాం ఎదుర్కొన్న భారీ తుపాన్లలో ఇదీ ఒకటని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుపానుతో ఎంత నష్టం జరిగిందో అంచనా వేస్తున్నామని అధికారులు తెలిపారు. సుమారు 2600 ఇళ్లకు నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఒక్క గియా లాయ్ ప్రావిన్స్‌లోనే సుమారు 2400 ఇళ్లు దెబ్బతిన్నాయని చెప్పారు. 57 ఇళ్లు పూర్తిగా నేలమట్టం అయ్యాయని అన్నారు. డాక్ లాక్ ప్రావిన్స్‌లో ముగ్గురు, గియా లాయ్ ప్రావిన్స్‌లో ఇద్దరు మరణించారు. పొరుగున ఉన్న కాంగ్ ఎన్‌గాయ్ ప్రావిన్స్‌లో గల్లంతైన ముగ్గురి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. తుపాను బీభత్సానికి సంబంధించిన పలు వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. చెట్లు నేలకూలడం, విద్యుత్ తీగలు తెగడంతో అనేక ప్రాంతాల్లో ప్రజలు ఇక్కట్ల పాలయ్యారు. భీకర గాలుల ధాటికి అనేక ఇళ్ల అద్దాలు పగిలిపోయాయి. ఇక కాల్మేగీ కారణంగా ఫిలిప్పీన్స్‌లో దాదాపు 200 మంది మరణించారు. 135 మంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఈ వారం మొదట్లో ఫిలిప్పీన్స్ తీరాన్ని తాకిన కాల్మేగీ తుపాను ఆ తరువాత వియత్నాంలో బీభత్సం సృష్టించింది. ప్రస్తుతం కాస్త బలహీనపడి పొరుగున ఉన్న కాంబోడియాలో ప్రవేశించింది. అయితే, ఫిలిప్పీన్స్‌కు సమీపంలోని సముద్ర జలాల్లో మరో తుపాను రూపుదిద్దుకుంటుండటంతో దేశ ప్రధాని ఫెర్డినాండ్ మార్కోస్ గురువారం జాతీయ ఎమ్జ్గ్ర÷న్సీ ప్రకటించారు. వాతావరణ మార్పుల కారణంగా ఆగ్నేయ ఆసియాలో తుపాన్లు, వరదల తీవ్రత పెరుగుతోందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.



# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

### సూర్యాపేట జిల్లా పశు వైద్యాధికారి శ్రీనివాసరావు

నేరేడుచర్ల: సూర్యాపేట జిల్లాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశు వైద్యాధికారి దామచర్ల శ్రీనివాసరావు తెలిపారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామాపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా టీకాలు వేసే కార్యక్రమం వేగవం తంగా కొనసాగుతుం దన్నారు. టీకాలు వేసే గ్రామాల్లో రైతులకు ఒకరోజు ముందుగా చాటింపుద్వారా సమాచారంఇస్తున్నట్లు తెలిపా రు. నేరేడుచర్ల మండలంలో నాలుగు బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో పశు వులకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో సహాయ సంచాలకులు కందుల సత్యనారాయణ, ఎల్ ఎస్ ఏ దుర్గాభవాని, సిబ్బంది మహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.


# ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ కు ఎంపికైన చల్ గల్ విద్యార్థులు

జగిత్యాల, : ఉమ్మడి జిల్లా స్థాయి లో నిర్వహించనున్న అథ్లెటిక్స్ పోటీలకు చల్ గల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పి. డి. వెంకటలక్ష్మి తెలిపారు.

ఎస్. కే. ఎన్నార్ డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్ లో తమ పాఠశాల విద్యార్థి కౌశిక్ వంద, 2 వందలు, 4 వందల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించాడని, అలాగే హైజంప్ లో కళ్యాణ్ ద్వితీయ స్థానం సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కౌశిక్, కళ్యాణ్ లను ఆ పాఠశాల హెచ్. ఎమ్ లతాదేవి, ఏ.పి.సి చైర్మన్ నీరటి సుకన్య, కోచ్ లు విశ్వ ప్రసాద్, కృష్ణ ప్రసాద్, అజయ్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

# నో వర్క్... నో శాలరీస్...

## వైసీపీ ఎమ్మెల్యేల దారేది?




**విజయవాడ,తెలంగాణ దిశ :**ఏపీలో శీతాకాలం అసెంబ్లీ సమావేశా లు దగ్గర పడుతు న్నాయా? ఈసారి వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తారా? లేకుంటే వేటు ఎదుర్కొంటారా? స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలతో ఆ ఎమ్మెల్యేల్లో కలవరం మొదలైందా? స్పీకర్ వ్యాఖ్యలు వెనుక అసలు ఉద్దేశం ఏంటి?ఈసారి అసెంబ్లీకి రాకుండేవేటు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలపై వేటు ఖాయమా? వైసీపీలోని 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ అయ్యన్నపా త్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు రాని వైసీపీ ఎమ్మెల్యేలపై చర్యలకు సిద్ధమవుతున్నారు స్పీకర్. రాజ్యాంగబ ద్ధంగా తీసుకునే చర్యలపై పరిశీలన చేస్తున్నామన్నారు. మాజీ సీఎం జగన్ తప్ప, ఆపార్టీకి చెందిన మిగతా 10మంది ఎమ్మెల్యేలు ఏడాదిన్న రగా జీతాలు తీసుకొంటున్నారని వ్యాఖ్యానించారు. ఒక ఉద్యోగి ఆఫీసుకు రాకుంటే సస్పెండ్ చేస్తున్నామని, మరి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుంటే తొలగించవద్దా? అంటూ ప్రశ్నించారు. ఈ లెక్కన వచ్చే సమావేశంలో వైసీపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకో వడం ఖాయంగా కనిపిస్తోంది. అసెంబ్లీకి వెళ్లి లైవ్‌లో కనిపించాలని వైసీపీ ఎమ్మెల్యేలు తహతహలాడుతున్నారు. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యల వెనుక. అలాగని పార్టీ అధినేత నిర్ణయాన్ని ధిక్కరించలేదు. ఈ నేపథ్యంలో జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అసెంబ్లీకి వెళ్లమని పార్టీ ఎమ్మెల్యేలకు చెబుతారా? వద్దంటారా? ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లాలని భావిస్తున్నట్లు వైసీపీ నుంచి చిన్నపాటి ఫీలర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారి పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నచం దంగా మారింది.స్పీకర్ వ్యాఖ్యల వ్యవహారం వైసీపీలో ముసలం మొదలవ్వడం ఖాయమని అనేవాళ్లు లేకపోలేదు. గెలిచిన ఎమ్మెల్యేలు కనీసం నియోజకవర్గం సమస్యలను చెప్పుకోవడానికి లేకుండా పోయిందని లోలోపల మదన పడుతున్నారు. ఈ లెక్కన స్పీకర్ వ్యాఖ్యలు ఆ పార్టీ నేతల్లో కలకలం రేపుతున్నాయి. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల నాటికి వైసీపీ అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఎమ్మెల్యేల మాట ఏమోగానీ, అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది జగన్ మాత్రమే వాళ్లందరూ శాలరీ తీసుకుంటున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకోవడంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాట్ కామెంట్స్ చేశారు.

అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాని 10 మంది ఎమ్మెల్యేలు ప్రతి నెల జీతాలు తీసుకుంటున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే జీతం తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై రాజ్యాంగ బద్ధంగా చర్యలు తీసుకుంటా మని, అసెంబ్లీలో చర్చలు జరిపిస్తానని స్పీకర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతిపక్షం గా మారింది. కానీ పది శాతం సీట్లు రాకపోవ డంతో ప్రతిపక్ష నేత హోదా కోసం జగన్ న్యాయపోరాటం చేస్తున్నారు. కానీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో వైసీపీ అసెంబ్లీ సమావేశాలకు బాయ్‌కాట్ చేస్తోంది. ఈ క్రమంలో 11మంది ఎమ్మెల్యేలు జగన్ సహా హాజరు కావడం లేదు. జగన్ తన జీతాన్ని తీసుకోవడం లేదని, మిగిలిన 10 మంది తీసుకుంటున్నారని స్పీకర్ మీడియాకు చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోతే చర్యలు తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు. "రాజ్యాంగ బద్ధంగా ఎలాంటి చర్యలు తీసుకోవా లనేది పరిశీలిస్తున్నాము" అని స్పష్టం చేశారు. జీతం తీసుకుని డ్యూటీ చేయకపోతే ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని, ఉద్యోగం నుంచి తీసేస్తామని..అటువంటిది ఎమ్మెల్యేలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు?" అని అయ్యన్నపా త్రుడు ప్రశ్నించారు. "అసలు కోడికి గుడ్డుకు తేడా తెలియని వైసీపీ వాళ్ల గురించి మాట్లాడటం వేస్ట్"అనిఅన్నారు. రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టాయని, రాజకీ యాలు కాస్ట్‌లీగా మారిపోయాయని కూడా వ్యాఖ్యానించారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చలు జరగనున్నా యని, ప్రజల సమస్యలపై చర్చించాలం టూ ఎమ్మెల్యేలకు సూచించారు. ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడంపై అసెంబ్లీలోచర్చిం చి ఎమ్మెల్యేల జీతాలు ఆపివేయడం లేదా సస్పెన్షన్‌లు విధించడం వంటివి జరగవచ్చు. ఈ మధ్య అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కాకుండా, ప్రజల సమస్యలు చర్చించకపోవడం పట్ల నేతలు కూడా తీవ్ర విమర్శల చేస్తున్నారు. స్పీకర్ అయ్యన్నపా త్రుడు గతంలో కూడాపై తీవ్ర వ్యాఖ్యలు చేసి, మంత్రులు, ఎమ్మె ల్యేలపై చురకలు వేసిన సందర్భాలు ఉన్నాయి

# సర్ 2.0 పై కొనసాగేనా?

న్యూఢిల్లీ, : భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల జాబితాలను డిజిటల్ యుగానికి అనుగుణంగా మార్చే ప్రయత్నం. బిహార్‌లో చేపట్టిన ప్రక్రియ విజయవంతమైంది. లక్షల మంది ఫేక్ ఓటర్లు తొలగిపో యారు. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఈసీఐ భావిస్తోంది. అయితే,ఇది రాజకీయ వివాదాలకు కారణమవుతోంది. దేశవ్యాప్తంగా ఫేక్ ఓటర్లను గుర్తించి తొలగించాలనే ఈ కార్యక్రమం, డెమోక్రటిక్ ప్రాసెస్‌ను బలోపేతం చేస్తుందని ఈసీఐ చెబుతుంటే, వ్యతిరేకవాదులు ఇది ఓటర్ల హక్కులను దెబ్బతీస్తుందని ఆరోపిస్తున్నారు.ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలను విస్తృతంగా సమీక్షించి, అక్రమ ఎంట్రీలను తొలగి ంచే ప్రక్రియ. దీని ద్వారా జన్మస్థలం, ఆధార్ వంటి డాక్యుమెంట్లను ధ్రువీకరించి, డూప్లికేట్లు, అన్‌వెరిఫైడ్ రికార్డులను ఇన్‌స్పెక్ట్ చేస్తారు. 2025లో రెండో దశలో 9 రాష్ట్రాలు (ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ,మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్) మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాలు (అండమాన్ ? నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి)లో మొదలైంది. మొత్తం 321 జిల్లాల్లో 1,850 అసెంబ్లీ సెగ్మెంట్లను కవర్ చేస్తూ, 10 లక్షల మంది అధికారు లు పాల్గొంటారు. డిసెంబర్ 4 నాటికి పూర్తి అవుతుందని ఈసీఐ ప్రకటించింది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను పెంచడానికి డిజిటల్ టూల్స్‌ను ఉ పయోగిస్తుంది, కానీ దీనిఅమలులో రాజకీయ పక్షాల నుంచి వ్యతిరే కత వస్తోంది.బిహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైంది. ఎస్ఐఆర్ తర్వాత 65 లక్షల మంది ఫేక్ ఓటర్లను జాబితా నుంచి తొలగించా రు. ఇందులో డూప్లికేట్లు, మర్గదార్శకాలు అక్రమ ఎంట్రీలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే, ఈ ప్రక్రియ సుప్రీం కోర్టులో సవాల్ చేయ బడింది. ఎందుకంటే 30 లక్షల మంది చట్టబద్ధ ఓటర్లు తొలగిం చబడ్డారనికాంగ్రెస్ వంటి పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలి విశ్లేష ణలు, 14లక్షలడూప్లికేట్లు, 1.32 కోట్లు కుటుంబాల మధ్య మిక్సప్ లను తెలియజేస్తున్నాయి, ఇది ప్రక్రియలో లోపాలను సూచిస్తోంది. బిహార్ అనుభవం, ఎస్ఐఆర్ సామర్థ్యాన్ని చూపిస్తూనే, అమలు లోపాలు, రాజకీయ దుష్ప్రయోగాల అవకాశాలను కూడా హైలైట్ చేస్తోంది.ఓటర్ డేటా అసమతుల్యతలు పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువ. అయినా అక్కడి అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ సర్‌ను వ్యతిరేకిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో. ఆమె కోల్‌కతాలో పెద్ద ర్యాలీ నిర్వహించి, 'ఒక్క చట్టబద్ధ ఓటర్ తొలగిస్తే బీజేపీ పతనం తప్పదని హెచ్చరించారు. ఈసీఐ అధికారులు రాష్ట్ర సిబ్బందిని బెదిరిస్తున్నారని, ఇది ఎన్ఆర్సీ లాంటి వ్యవస్థగా మారవచ్చని ఆమె ఆరోపణలు చేశారు.డేటా విశ్లేషణల ప్రకారం, 2023 నుంచి జనాభా 13.8% పెరిగినప్పటికీ, ఓటర్ల సంఖ్య 61.6% పెరిగింది, ఇది1.04 కోట్ల అదనపు ఓటర్ల అవకాశాన్ని సూచిస్తోంది. ఈసీఐ అసాధారణ పెరుగుదలను గుర్తించి, డేటా మ్యాపింగ్ పూర్తి చేసింది,కానీ టీఎంసీ పార్టీఇదిరాజకీయ ఆయుధంగా మారవచ్చని భయపడుతోంది. ఈ వివాదం, ఓటర్ లిస్ట్ ఇన్‌ఫ్లేషన్‌ను ఎలా నియంత్రించాలో దేశానికి సవాలుగా మారింది. కేరళలోనూ తేడాలు ఉన్నాయి. రాష్ట్ర జనాభా 3.60 కోట్లు ఉండగా, ఆధార్ కార్డులు 4.09 కోట్లు ఉన్నాయి, అంటే 49 లక్షల అదనపు కార్డులు. ఇవి రేషన్ కార్డులతో లింక్ అయి, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సి స్టమ్‌లో దుర్వినియోగానికి దారితీస్తున్నాయని విమర్శకులు చెబుతు న్నారు. రాష్ట్రంలో 32 లక్షల బోగస్ రేషన్ కార్డులు ఉన్నాయని పాత అంచ నాలు ఉన్నాయి, వనరుల రక్షణ, సవాళ్లుసర్‌తోపాటు ఆధార్‌ఆ ధారిత వెరిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 5.8కోట్ల ఫేక్ రేషన్ కార్డులు తొలగించబ డ్డాయి, ఇది పీడీఎస్ వ్యవస్థను శుద్ధి చేసి,బ్లాక్ మార్కెట్‌లీకేజీలను తగ్గించింది. సమతుల్య అమలు కోసం సూచనలు సర్ ప్రక్రియ భారత డెమోక్రసీకి అవసరమైన సంస్కరణ. ఎందుకంటే ఇది ఫేక్ ఎంట్రీలను తొలగించి, నిజమైన ఓటర్ల హక్కులనురక్షిస్తుంది. అయితే,బిహార్, బెంగాల్ వంటి ఉదాహరణలు చూపిస్తున్నట్టు, రాజకీయ జోక్యాలు, టెక్నికల్ లోపాలు దీన్ని సున్నితంగా మారుస్తు న్నాయి. ఈసీఐకు స్వతంత్ర విమర్శకుల సలహాలు, డేటా ట్రాన్స్‌పరెన్సీ, రాష్ట్రాలతో సమన్వయం అవసరం

# పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..




కొపెన్‌హెగెన్ : డెన్మార్క్ ప్రభుత్వం 15 సంవత్సరాలలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించింది. దీనికి సంబంధించిన నివేదికను ఆ దేశ డిజిటలైజేషన్ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసింది. సోషల్ మీడియా పిల్లల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నిద్రకు అంతరాయం కలుగుతుందని, ఏకాగ్రత కోల్పోతున్నారని తెలిపింది. ఆన్‌లైన్ మోసాలకు పిల్లలు బలైపోతున్నారని అధికారులు వెల్లడించారు..

### డెన్మార్క్‌ప్రభుత్వం నిర్ణయం
### 15 సం౹౹ల లోపు వారికి అనుమతి నిరాకరణ

డిజిటలైజేషన్ మంత్రి మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల బాల్యాన్ని, వారి సమయాన్ని, వారి ఆనందాన్ని దోచుకుంటో ందని, దానికి తాము ముగింపు పలుకుతున్నామని ప్రకటించారు. ఆన్‌లైన్ ప్రపంచంలో హానికరమైన కంటెంట్, వాణిజ్య ప్రభావాలు తీవ్రమైపోయాయని, వాటి నుండి యువతను రక్షించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల్లో యుట్యూబ్, స్నాప్‌చాట్, ఇన్‌స్టా గ్రామ్, టిక్‌టాక్ వంటి దిగ్గజ సంస్థలపై నియంత్రణలు ఉన్నాయి. అయితే 13 సంవత్సరాలు దాటిన వారికి తల్లిదండ్రుల సమక్షంలో అనుమతించనున్నారు. అదీ పరిమిత కాలం వరకే.

కొన్ని నెలల క్రితం ఆస్ట్రేలియా ఇటువంటి నిర్ణయాన్నే తీసుకుంది. యూరోపియన్ యూనియన్ దేశాల్లో సోషల్ మీడియాను వయో పరిమితి ఆధారంగా నియంత్రించిన మొదటి దేశంగా డెన్మార్క్ నిలిచింది. ఈ నిర్ణయంతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం, వారి అభివృ ద్ధికి, విచ్చలవిడాగా పెరిగిపోతున్న సోషల్ మీడియా నియంత్రణకు దోహదపడుతుందని పలువురు భావిస్తున్నారు.

# రాయలసీమలో రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు

**తిరుపతి,తెలంగాణ దిశ :** ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు రానున్నాయి. రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ సిద్ధమైంది. పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనుంది. త్వరలో విశాఖపట్నంలో జరగనున్న సీసీఐ భాగస్వామ్య సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం, కంపెనీ మధ్య అవగాహన ఒప్పంద కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 77 వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రానుంది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో.. రూ.22,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 7000 మందికి, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉ ందని అంచనా.కాగా, విశాఖపట్నంలో నవంబర్14,15 తేదీల్లో జరగనున్న సీసీఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాల్లో.. 1,750 మెగావాట్ల సోలార్/ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ , సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా టెండర్లలో భాగంగా ఎస్ఏఈఎల్ ఈ ప్రాజెక్టులు చేపడుతోం ది. పరిశ్రమలు, డేటా సెంటర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం లక్ష్యంగా వీటిని నిర్మిస్తున్నారు. అంతేకాకుండా 200 మెగావాట్ల బయోమాస్ ప్రాజెక్టును చేపడుతున్నారు. అందులో భాగంగా 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పలు బయోమాస్ ప్లాంట్లను నిర్మిస్తారు. వ్యవసాయ వ్యర్థాలను ఉప యోగించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంతేకాకుండా, రూ. 3000 కోట్లతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ అవకాశాలు వినియోగి ంచుకోవచ్చు. మారిటైం రంగంలో లాజిస్టిక్స్‌ను, ఎగుమతులను బలోపేతం చేసేందుకు రూ.4000 కోట్ల పెట్టుబడితో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. కాగా, తమ కంపెనీ ఇప్పటికే ఏపీలో రూ. 3,200 కోట్లు పెట్టుబడులు చేసినట్లు ఎస్ఏఈఎల్ తెలిపింది. 9 నెలల్లో 600 మెగావాట్ల సామర్థ్యాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపింది.కాగా, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్వర్క్ ఏర్పాటు, గ్రీన్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల హిందూజా గ్రూప్ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే.తర్వాత శుద్ధ ఇంధనం (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఏపీకి భారీ పెట్టుబడులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో బ్రూక్ ఫీల్డ్ చేపట్టనున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఖీఇఅ) రూ.7,500 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ.9,910 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అందులో భాగంగా 640 మెగావాట్ల పవన విద్యుత్, 400 మెగావాట్ల సౌర శక్తితో.. మొత్తంగా 1040 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, ఇప్పటివరకు ఒక ప్రైవేట్ ప్రాజెక్టుకు ఆర్ఈసీ.. ఇంత భారీ మొత్తంలో నిధులు ఇవ్వడం ఇదే మొదటిసారి అని అధికార వర్గాలు వెల్లడించాయి.

# ఆల్‌ఖైదా అనుబంధ సంస్థ దురాగతం

## మాలీలో ఐదుగురు భారతీయుల కిడ్నాప్

న్యూఢిల్లీ: ఆఫ్రికా దేశం మాలీలో ఐదుగురు భారతీయులను ఉ గ్రమూకలు కిడ్నాప్ చేశాయి. ఇది అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న మూకల పనేనని అక్కడి వార్గాలు చెబుతున్నాయి. స్థానికంగా ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్టు చేపడుతున్న సంస్థలో ఆ ఐదుగురు పనిచేస్తున్నారు. వారు కిడ్నాప్‌కు గురైన విషయాన్ని సంస్థ ధ్రువీకరించింది. రాజధాని బొమాకోలోని మిగతా భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు. అయితే, ఈ విషయంపై అక్కడి ఉగ్రవాద సంస్థలు ఏవీ ఇంకా స్పందించలేదు.మాలీలో ప్రస్తుతం

మిలటరీ జంటా పాలన సాగుతోంది. మరోవైపు అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థలకు అనుబంధంగా పనిచేస్తున్న ఉ గ్రమూకలు దేశంలో రణరంగం సృష్టిస్తున్నాయి. వారికి అడ్డుకట్ట వేయలేక సైన్యం నానా కష్టాలు పడుతోంది. అసలే ఆర్థికకష్టాల్లో ఉ న్న దేశంలో అంతర్గత కుమ్ములాటలు పరిస్థితిని నానాటికీ దిగజారుస్తు న్నాయి. అల్ ఖైదా అనుబంధ జేఎన్ఐఎమ్ ఉగ్రసంస్థ దేశంలోకి ఇంధనం రాకుండా అడ్డుకోవడంతో అవస్థలు తీవ్రమయ్యాయి. మాలీలో విదేశీయుల అపహరణలు నిత్యకృత్యంగా మారాయి. వర్గాల మధ్య కుమ్ములాటలతో మాలీ 2012 నుంచి అల్లకల్లోలంగా మారింది. సెప్టెంబర్‌లో కూడా జేఎన్ఐఎమ్ ఉగ్రవాదులు విదేశీయులను కిడ్నాప్ చేశారు. యూఏఈకి చెందిన ఇద్దరిని, ఒక ఇరాన్ దేశస్థుడిని బొమాకోకు సమీపంలో కిడ్నాప్ చేశారు. 50 మిలియన్ డాలర్లు ఇచ్చాక వారిని విడిచిపెట్టారు.

## ఘనంగా దేవత విగ్రహాల ప్రతిష్ట

సి. బెళగల్: సి.బెళగల్ మండలం మారం దొడ్డి గ్రామంలో శ్రీరామాలయం ప్రాంగణంలో నవగ్రహ, శ్రీ సుబ్రహ్మణ్య, కుమార స్వాముల , నాభి శిలల ప్రతిష్టను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.

పురోహితులు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో పండిత బృంద సభ్యులు, వేద పండితులు ఆలయంలో విగ్రహాలను ప్రతిష్టిం చారు. అనంతరం పుణ్య వాచనం, యాగశాల ప్రవేశం, విగ్రహాలకు జలావాసం, అగ్ని శిలా ప్రతిష్టాపన కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు భక్తులు వేల సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

# సినిమా..

## హాలీవుడ్‌లో కూడా వివక్ష!



అగ్ర కథానాయిక దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భారతీయ నటీనటుల పట్ల అక్కడి వారు వివక్ష చూపిస్తుంటారని, అది అందరికీ తెలిసిన విషయమే అని పేర్కొంది. భారతీయ సినిమాలో తిరుగులేని గుర్తింపును దక్కించుకున్న ఈ మంగళూరు సోయగం హాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది. 'త్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్' వంటి చిత్రాలతో పాటు పలు అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ గ్లోబల్ ఐకాన్‌గా పేరు తెచ్చుకుంది. ఓ ఇంటర్నేషనల్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడింది. 'అందరూ అనుకుంటున్నట్లుగా హాలీవుడ్‌లో ప్రతిదీ నిజాయితీగా, సక్రమంగా ఏమీ ఉండదు. భారతీయ నటీనటులు అక్కడ వివక్షను ఎదుర్కొం టారు. ముఖ్యంగా శరీర రంగు ఆధారంగా వివక్ష చూపిస్తుంటారు. ఉద్దేశ్యపూర్వకంగా అలాంటివి జరుగుతుంటాయి. స్కిన్ కలర్‌తో పాటు మన ఇంగ్లీష్ యాసపై కూడా అక్కడ చిన్నచూపు ఉంటుంది. అందుకే హాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకొని సక్సెస్ కావడం అంత సులభం కాదు. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే ఓ భారతీయురాలిగా నా గొంతును బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటా. నా మూలాలను గౌరవించే వారితోనే పనిచేస్తానని నిక్కచ్చిగా చెబుతాను' అని దీపికా పదుకొణె పేర్కొంది. 'స్పిరిట్' 'కల్కి' వంటి పాన్ ఇండియా తెలుగు చిత్రాల నుంచి దీపికా పదుకొణె తొలగింపు వ్యవహారం జాతీయ స్థాయిలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీపికా పదుకొణె ప్రస్తుతం బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలపై దృష్టి పెడుతున్నది.

## ఆకట్టుకుంటున్న విజయ్ తనయుడు డెబ్యూ మూవీ..




టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరోసారి పవర్ ప్యాక్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అయితే ఈ సినిమాతోనే తమిళ స్టార్ విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇప్పటికే షూటింగ్ శరవేగంగా సాగుతుండగా, తాజాగా చిత్ర బృందం టైటిల్ మరియు ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. సినిమా టైటిల్‌ను 'సిగ్మా (SIGMA)'గా ఫిక్స్‌చేశారు. విడుదలచేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సందీప్ కిషన్ బంగారం, నగదు కట్టలపై చేతికి కట్టు కట్టుకుని సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన కళ్లల్లో కనిపిస్తున్న యాంగర్, ఇంటెన్సిటీ ఈ మూవీ టోన్‌ను స్పష్టంగా చెబుతోంది. సందీప్ ఇప్పటివరకు చేసిన రోల్స్ కంటే భిన్నంగా, ఈసారి పూర్తి స్థాయి యాక్షన్ ప్యాక్డ్ అవతారంలో కనిపించనున్నారు. ఫ్యాన్స్ ఈ లుక్‌పై ఫిదా అవుతున్నారు. సమాచారం ప్రకారం, సిగ్మా ఒక ట్రెజర్ హంట్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. సస్పెన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ మూవీ విజువల్‌గా గ్రాండ్‌గా ఉండబోతోందని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రాజెక్ట్ ప్రారంభం నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. తమిళ స్టార్ దళపతి విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ సినిమాతో దర్శకుడిగా ఎంట్రీ ఇస్తుండటం మరింత స్పెషల్. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్,విజువల్స్ విషయంలో ఆయన చూపుతున్నప్రత్యేక దృష్టి సినీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది. తొలి సినిమానే పాన్ ఇండియా రేంజ్‌లో ప్లాన్ చేయడం ద్వారా ఆయన సీరియస్ ఫిల్మ్‌మేకర్‌గా కనిపిస్తున్నారు. 'మైఖేల్', 'టెనెట్' తరహాలో ఆ యాక్షన్-ఇంటెన్స్ జానర్‌లో సిగ్మా సినిమా సందీప్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవబోతుందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయం. "When Greed Meets Guts" అనే ట్యాగ్‌లైన్ పోస్టర్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తి మరింత పెంచింది. సందీప్ కిషన్ - జాసన్ సంజయ్ కాంబినేషన్‌లో వస్తున్న 'సిగ్మా' త్వరలోనే థియేటర్స్‌లో సందడి చేయబోతోంది. ట్రెజర్ హంట్, హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషన్ కలగలిపిన ఈ మూవీ 2025లో టాలీవుడ్‌లో బిగ్ బ్లాస్టర్ అవ్వడం ఖాయం అని సినీ వర్గాలు చెబుతున్నాయి!

## కల నెరవేరింది



'పెద్ది' ఫస్ట్ సింగిల్ 'చికిరి చికిరి' సాంగ్ ప్రస్తుతం సోషల్ మీడియా సన్సేషన్‌గా మారింది. మొత్తం 13 దేశాల్లో టాప్ ట్రెండింగ్‌లో ఈ పాట ఉందని, నాలుగు భాషల్లో కలిపి 53 మినియన్ ప్లస్ వ్యూస్‌ని ఈ పాట సాధించిందని, టాప్ చార్ట్స్‌లో నంబర్ వన్ స్థానంలో ఉందని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. శనివారం రాత్రి హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో ఏ.ఆర్.రెహమాన్ మ్యూజికల్ నైట్ జరిగింది. ఈ కార్యక్రమంలో అగ్ర హీరో రామ్‌చరణ్ సందడి చేశారు. ఆయనతోపాటు కథానాయిక జాన్వీకపూర్, 'పెద్ది' దర్శకుడు బుచ్చిబాబు సానా కూడా హజరై ఆడియన్స్‌లో మరింత జోష్ నింపారు. 'పెద్ది' సినిమాలోని 'చికిరి చికిరి' సాంగ్ లైవ్ పెర్‌ఫార్మెన్స్ ఈ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'రెహ్మాన్‌సార్ సంగీతంతో భాగమవ్వాలనేది నా చిన్ననాటి కల. అది నా 'పెద్ది' సినిమాతో నెరవేరినందుకు చెప్పలేనంత సంబరంగా ఉంది.' అని ఆనందం వెలిబుచ్చారు. 'పెద్ది' ఒక డిఫరెంట్, యూనిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా అని జాన్వీ కపూర్ అన్నారు. వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది.

## వర్తమాన అకృత్యాలపై రాజేసిన కొలిమి..!



ఇటీవల గొప్ప సామాజిక కవిత్వం రాస్తున్న వారిలో పతివాడ నాస్తిక్ ఒకరు. ఆయన వెలువరించిన కవితా సంపుటి 'కొలిమి రాజేయ్యాల్సిందే' వర్తమాన సమాజానికి అవసరమైన స్వరం. ఈ మండే తన మనసు కొలిమినుంచి అక్షరాలను ఏరుకుంటాడు. వాటిని బాణాల్లా మార్చి సంధించటానికి విల్లును ఎక్కుపెట్టినప్పుడు ఇంక్విలాబ్ జిందా బాద్ నినాదాలు తప్ప, మరే మాటలు అతనికి వినిపించవు. చీకటి బజార్లో ముంచెత్తుతున్న దోపిడీ వాయుగుండాల వరద

బీభత్సాన్ని మాత్రమే అతడు చూడగలుగుతాడు. తన చేతిలోని విల్లు తాడును లాగినప్పుడల్లా చెమట సంపద కొట్టుకుపోయి, దిక్కుతోచని దీనస్థితిలో వున్న బడుగు బతుక్కి భరోసా నిచ్చే ఒక శబ్దాన్ని కమ్యూనిజం వేదికగా ఈ కవి అందిస్తున్నాడు. కష్టజీవులంతా ఎర్ర సముద్రపు తరంగాల హోరులో కలిసి ఉద్యమించే రోజు వస్తుందని తన నమ్మకాన్ని ఒక జెండాలా అక్షరాల సాక్షిగా ఎగురవేస్తున్నాడు. కడుపులో లుంగచుట్టుకు పోతున్న పేగుల్ని తెంచుకొని పుట్టే పిడికిళ్లను గురించి చెబుతూ 'అవి మీ కంచాల మీద కలబడి/ మీ గోడౌన్ల మీదికి ఎగబడి/ మీ కొంపల్ని నేలమట్టం చేస్తాయి' అంటూ దోపిడీ వర్గాలకు పదునైప హెచ్చరికల్ని జారీచేస్తున్నాడు ఈ కవి.

నిబద్ధత కలిగిన కవుల వరుసల్లో సముచిత స్థానాన్ని అందుకున్న పతివాడ నాస్తిక్, వర్తమానంలో దిశా నిర్దేశాలు లేని కవులపట్ల తన నిరసనను తీవ్రమైన స్థాయిలోనే వ్యక్తం చేస్తున్నాడు. కష్టజీవుల కన్నీళ్ల తడిస్పర్శ అంటే ఏమిటో అర్థం కాకుండానే- పేదల ఆకలి మీద అలవోకగా కవిత్వాన్ని రాసే కవులందర్నీ ఒకచోట సమావేశపరిచి 'నువ్వు మురికివాడల్లోని/ ఇరుకు గుడిసెల్లోకి/ కష్టజీవుల్లోని/ చెమట చుక్కల్లోకి/ ప్రయాణించటం మొదలుపెట్టు/ అప్పుడు నువ్వు/ ఆకలిగొన్న చంటిబిడ్డకు/ అమ్మ కలిపిన పాలబువ్వలా/ కమ్మ కమ్మగా పరిమళిస్తావ్%ొ%' అంటూ ఉద్బోధిస్తున్నాడు. ఈ మాటల్ని వర్తమాన కవులు చాలామంది జీర్ణించుకొని, వాటిని పాఠాలుగా స్వీకరించి ప్రజాకవులుగా మిగిలిపోవాలని ఆశిస్తున్నాడు.

వానలు, వరదలు ముంచెత్తి, కొంపా గూడూ నాశనమై పోయి, కన్నీళ్లతో ఓదార్చుకుంటూ, కలిసి కలో గంజో సర్దుకుని పంచు కుంటు న్న ఎర్రకలువల పక్కన నిలబడి, వాళ్ల హదయ స్పందనను ఆసక్తిగా కవి వినిపిస్తున్నాడు. వాళ్ల కళ్లను వాళ్ల వేళ్లతోనే పొడిపించుకునేలా చేసిన నయావంచకులను ఎదురుగా నిలబెట్టి, గతంలో వాళ్లు చేసిన నిర్వాహకాలన్నింటినీ ఏకరువు పెడుతూ, కనురెప్పల మధ్య కోపాన్ని నిప్పుల్లా కురిపిస్తూ, పిడుగుల్లా మాటల్ని సంధిస్తూ 'చూడు../ నూటాయాభై కోట్ల బిందువులతో/ నిండిన ఈ సుందర సరోవరంలో/ ఎలుగెత్తే చైతన్యం వెల్లువలా లేస్తుంది/ ఎర్రని కలువలు పూసే/ మంచికాలం/ తప్పక నీ అంతు తేలుస్తుంది' అంటూ రేపటి కాలం మాత్రం మాదేనంటూ గర్జిస్తున్నాడు.

ఇది కష్టజీవుల చెమట వాసనతో పరిమళిస్తున్న కవిత్వం. రాజ్యం వెన్నులో వణుకు పుట్టించి, చట్టం కన్ను తెరిపించి, పేరుకున్న కుట్రల ముళ్ళ డొంకల్ని నరికివేసి, రేపటి ఉదయానికి కష్టాలు, కన్నీళ్ల పట్ల, వాళ్లుఎదుర్కొంటున్న దోపిడీ మూలాల పట్ల ఈ కవికిసమగ్రమైన అవగాహనవుది. ఆయన కవిత్వంలో తొందరపాటు లేని అర్థవంతమైన ఆలోచనలవరుసలు మనతో కరచాలనం చేయటం విశేషం. తన కవిత్వం ద్వారా పూర్తి విశ్వాసాన్ని పొందగలిగిన స్థాయిలో నిలబడి, అద్భుత భావజాల సమ్మిళితంతో, గొప్ప సజనాత్మక అనుభవాలను జోడించిన ఈ కవి, ఇజ్రాయిల్ చాలా పాశవికంగా పాలస్తీనా దేశంపై విరుచుకుపడుతున్న దాడిని తీవ్రమైన స్వరంతో ఖండిస్తూ 'నువ్వు ఎంత గట్టిగా కొడితే/అంతగట్టిగా పైకి లేచి/ నరాలనిండా నెత్తుటి చైతన్యపు/ గాలితరంగాల్ని వెంటబెట్టుకొని/ చెక్కుచెదరని స్థైర్యంతో/ నిద్ర పోతున్న దిక్కుల/ గుండెలమీద గుద్ది మరీ/ మేల్కొపగల పాలస్తీనా/ పాలబుగ్గల తోలుబంతిని%ొ%' అంటూ తన కవితను దండోరా చేసి అందించిన శబ్దం, అక్షరాల తలపాగాలతో ఎప్పటికీ మనకు వినిపిస్తూనే వుంటుంది.

## సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన అనుపమ.. ఎందుకంటే?



సోషల్ మీడియా వేదికగా తనను వేధింపులకు గురి చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ నటి అనుపమ పరమేశ్వరన్ కేరళ సైబర్ క్రైమ్ పోలీసుల్ని ఆశ్రయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఓ ఇన్‌స్టా ప్రొఫైల్ కొన్ని రోజుల క్రితం నా దృష్టికొచ్చింది. నేను, నా ఫ్యామిలీ, నా సహనటులే లక్ష్యంగా అసత్య ప్రచారాలతో కూడిన పోస్టులు ఆ ప్రొఫైల్‌లో కనిపించాయి. అందులో కొన్ని మార్ఫింగ్ ఫొటోలు కూడా ఉన్నాయి. నాపై ద్వేషంతో కొన్ని ఫేక్ అకౌంట్లను కూడా ఆ వ్యక్తి సృష్టిం చినట్టు తెలిసి షాకయ్యా. బాధపడ్డాను కూడా. ఈ వ్యవహారం శృతి మించకూడదనే పోలీసులను ఆశ్రయించా. వారు కూడా వెంటనే స్పందించారు. చట్టవ్యతిరేకమైన ఈ చర్యలకు పాల్పడ్డ వ్యక్తిని వారు సత్వరమే కనిపెట్టారు. అయితే.. బాధ కలిగించే విషయం ఏంటంటే.. ఈ తప్పు చేసిన వ్యక్తి ఓ స్త్రీ. పైగా ఆమె 20ఏళ్ల యువతి. ఆమెది చాలా చిన్నవయసు. అందుకే.. ఆమె భవిష్యత్ పాడవ్వకూడదని వివరాలు పంచుకోవడం లేదు.' అంటూ చెప్పుకొచ్చారు అనుపమ పరమేశ్వరన్.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215